# గొప్ప సంఘటన

## (థెస్సలొనీకయులకు వ్రాసిన పత్రికల సంగ్రహ సమీక్ష)

**A. ఉపోద్ఘాతం :** గలతీ పత్రిక తప్ప పౌలు వ్రాసిన పత్రికలన్నిటిలో థెస్సలొనీకయులకు వ్రాసిన పత్రికలు మొదటివి. యేసు మరణ పునరుత్థానాల అనంతరం 20 సంవత్సరాలకు, క్రైస్తవ విశ్వాసం మరియు జీవిత సరళి ఎలా ఉన్నాయో ఈ పత్రికలు చక్కగా వివరిస్తున్నాయి.

**1. గ్రంథకర్త :** ఈ పత్రికలు సిల్వాను (సీల) మరియు తిమోతిల చేత పంపించబడినవి గాని పౌలు తానే స్వయంగా ఈ పత్రికలను వ్రాసాడు. (I థెస్స 1:1; II థెస్స 1:1) అతడు స్వయంగా, నేరుగా మాట్లాడిన విధానం (I థెస్స 2:18) తిమోతిని గూర్చి ప్రస్తావించడం (I థెస్స 3:2-6) స్వయంగా సంతకం చేయడం (II థెస్స 3:17) పౌలే వ్రాసాడనడానికి నిర్వివాదాంశాలు. రెండవ పత్రికలో శైలి కొంత సంప్రదాయబద్ధంగా ఉన్నందువలన పౌలు వ్రాయలేదన్న అభిప్రాయం ఉన్నప్పటికిని, మరెవరో వ్రాసి ఇందులో చేర్చారనడానికి వీలులేదు (II థెస్స 2:1,2)

**2. రచన కాలం మరియు సందర్భం :** థెస్సలొనీక పట్టణంలో క్రీ.శ. 50వ సంవత్సరం, సంఘాన్ని స్థాపించిన వెంటనే, పౌలు మరియు అతని అనుచరులు ఆ ప్రదేశాన్ని విడిచి వెళ్ళాల్సి వచ్చింది. (అపొ 17:10). క్రైస్తవులుగా మారిన వారికి, పౌలు బోధించాలని ఆశించినదానినంతటిని చెప్పలేక పోయాడు. కనుక వారి వద్దకు తిమోతిని పంపించాడు. (అపొ 18:5). వారు ఆసక్తి కలిగి, ఆత్మలో తీవ్రత కలిగి ఉన్నారు గాని, కొన్ని నైతిక సమస్యలు మరియు యేసు రెండవ రాకడను గూర్చిన కొన్ని ప్రశ్నలతో సతమత మౌతున్నట్లు పౌలుకు తెలియజేసాడు. వెంటనే పౌలు మొదటి పత్రికను వ్రాసాడు. ఈ పత్రిక బహుశా క్రీ.శ. 52-53 సంవత్సరాల మధ్య కాలంలో వ్రాయబడి ఉండవచ్చును. మొదటి పత్రిక వ్రాసిన స్వల్ప కాలానికే రెండవ పత్రికను వ్రాసాడు.

**3. థెస్సలొనీక సంఘము :** థెస్సలొనీక అనే స్థలము రోమా చక్రవర్తి జీవితంలో చోటు చేసుకొన్న ఒక ముఖ్యమైన కాలనీ. అది ఫిలిప్పీ పట్టణానికి పశ్చిమ దిశలో 100 కి.మీ. దూరంలోను, ఏథెన్సుకు ఉత్తర దిశలో 200 కి.మీ. దూరంలోను ఉన్నది. మాసిదోనియాలో అది ప్రధాన పట్టణం. ఈ పట్టణంలో ఉష్ణధారలున్నందువలన దానికి మొదట 'థెర్మా' అనే అనే పేరు పెట్టబడింది. అలెగ్జాండర్ మహా చక్రవర్తి సవితి తల్లి కుమార్తెను వివాహం చేసుకొన్న కాసెండర్ తన భార్య జ్ఞాపకార్థంగా దానికి క్రీ.పూ. 316 లో థెస్సలొనీకె అని పేరు పెట్టాడు. ఆ పట్టణం నేటికి నిలిచి ఉన్నది. దాని ప్రస్తుత పేరు 'సలోనికా' థెస్సలొనీక సంఘ స్థాపన గూర్చి అపొస్తలుల కార్యములు 17:1-4 లో చూడవచ్చు. ఈ సంఘము ఎంత మాదిరికరమైనదంటే, పౌలు కొరింథీయుల ఎదుట దానిని ఒక నమూనాగా ఉంచాడు. (I థెస్స 1:7; II కొరి 8:1-5).

**4. ముఖ్యాంశం :** సంఘము ఎత్తబడినపుడు, లేక క్రీస్తునందుండి, మృతులైనవారు లేపబడినప్పుడు, సజీవులుగా భూమిపై నిలిచి ఉన్నవారు ఏమౌతారన్న సందేహం

థెస్సలొనీకయ విశ్వాసులకు ఉండినది. దానిని పౌలు స్పష్టం చేసాడు. అయితే వారిలో కొందరు, ప్రభువు రాకడ సమీపించింది గనుక ఇక ఏ పని చెయ్యనవసరం లేదని, సోమరులుగా ఉన్నారన్న సంగతి పౌలుకు తెలిసి, ఆయన రాకడకు ముందు కొన్ని సంగతులు జరుగవలసి ఉన్నవని వివరిస్తూ, వారు కష్టపడి పని చెయ్యాలని హెచ్చరిస్తూ రెండవ పత్రికను వ్రాసాడు. ఈ రెండవ పత్రిక, క్రీస్తు విరోధిని గూర్చి, ఇతర పుస్తకాల కన్నా ఎక్కువ వివరాలను అందిస్తున్నది.

5. **రెండు పత్రికల విశిష్టత మరియు వ్యత్యాసం :** థెస్సలొనీకయులకు వ్రాసిన మొదటి పత్రిక, విశ్వాసులు క్రీస్తుతో ఎత్తబడుటను గూర్చి, అనగా సంఘమును తీసికొని వెళ్ళడానికి యేసుక్రీస్తు మధ్యాకాశానికి వస్తాడని తెలుపుతుంది. రెండవ పత్రిక ఆయన భూమి మీద తన రాజ్యాన్ని స్థాపించడానికి వస్తాడని వివరిస్తున్నది. ఈ రెండు సంఘటనలలో గొప్ప వ్యత్యాసం ఉన్నదన్నది గమనార్హం.

6. **ఉద్దేశం :**

అ) సువార్త యొక్క ప్రాథమిక సత్యాన్ని గూర్చి విశ్వాసులను స్థిరపర్చడానికి

ఆ) వారిని పరిశుద్ధ జీవితం కొరకు తీర్చిదిద్దడానికి

ఇ) క్రీస్తు పునరాగమనమును గూర్చి వారిని ఆదరించుటకు ఈ పత్రిక వ్రాయబడింది.

**B. థెస్సలొనీకయులకు వ్రాసిన మొదటి పత్రిక విభజన :** ఈ పత్రికను రెండు విధాలుగా విభజించవచ్చును. రెండు విభజనలు కూడ ప్రత్యేక ప్రాధాన్యతను తెలుపుతాయి.

**I. మొదటి రకం విభజన :**

1. క్రీస్తు రాకడను గూర్చి క్రైస్తవుని వైఖరి (సేవించుట, కనిపెట్టుట) - 1 అధ్యా.
2. క్రీస్తు రాకడలో క్రైస్తవుని ప్రతిఫలం - 2 అధ్యా.
3. క్రీస్తు రాకడ మరియు క్రైస్తవుని జీవితం - 3:1-4:12
4. క్రీస్తు రాకడ - క్రైస్తవుని మరణం - 4:13-18
5. క్రీస్తు రాకడను దృష్టిలో ఉంచుకొని క్రైస్తవుని చర్యలు - 5 అధ్యా
   (11వ వచనం మొదలుకొని 22 ప్రత్యేక ఆజ్ఞలు)

**II. రెండవ రకం విభజన :**

**1. క్రీస్తు రాకడ ప్రేరణ కలిగించే నిరీక్షణ - 1 అధ్యా**

అ) ఉపోద్ఘాతం (1:4)

ఆ) గొప్ప ఉపద్రవంలో, గొప్ప నిశ్చయతతో సువార్త అంగీకరించిబడింది. (1:5-7)

ఇ) సువార్త ఫలితాలు (1:8-10)

**2. క్రీస్తురాకడ కార్యరూపక నిరీక్షణ - 2 అధ్యా**

అ) నిజమైన క్రీస్తు సాక్షి ఉద్దేశం మరియు పద్ధతి (2:1-6)

ఆ) అపొస్తలుని పరిచర్య - తల్లి పాత్ర (ఆదరణ) (2:7-9)

ఇ) అపొస్తలుని పరిచర్య - తండ్రి పాత్ర - (అధికారం) (2:10-13)

ఈ) అపొస్తలుని పరిచర్య - సహోదరుని పాత్ర (సవాలు) (2:14-16)

ఉ) నిజమైన క్రీస్తు సాక్షి పొందే ప్రతిఫలం (2:17-20)

**3. క్రీస్తురాకడ శుద్ధీకరించే నిరీక్షణ (పవిత్రపరచబడుట) - 3:1-4:12**

అ) థెస్సలొనీకయులను గూర్చి తిమోతి తెచ్చిన మంచి నివేదిక (3:1-8)

ఆ) విశ్వాసంలో ఎదగాలని థెస్సలొనీకయులకు పౌలు విన్నపం (3:9-13)

ఇ) విశ్వాసులు ఎలా నడుచుకోవాలి. (4:1-12)

**4. క్రీస్తు రాకడ ఆదరణ నిచ్చే నిరీక్షణ - 4:13-18**

(క్రైస్తవునికి మరణం అనగానేమి ? సంఘానికి, ఎత్తబడుట అనగానేమి?)

**5. క్రీస్తురాకడ మేలుకొలిపే నిరీక్షణ (కార్యాచరణకు పూనుకొంటుంది) - 5 అధ్యా**

(మరణించిన విశ్వాసులు యేసులో నిద్రిస్తున్నారు. సజీవంగా ఉన్న విశ్వాసులు యేసు కొరకు మేల్కొని ఉంటారు. అ) క్రీస్తు రాకడను దృష్టిలో ఉంచుకొని, మెలకువగా మరియు అప్రమత్తంగా ఉండాలన్న పిలుపు. (5:1-10). ఆ) క్రైస్తవులకు ఆజ్ఞలు (5:11-28).

## C. అంశాలవారిగా సంగ్రహ సమీక్ష

### I. సంఘ ప్రసిద్ధి (I థెస్స 1 అధ్యా) :

**1. శక్తి గల సంఘము :** (1:1-3) ఈ భాగంలో థెస్సలొనీక సంఘానికున్న మంచి లక్షణాలను, మంచిపేరును గూర్చి పౌలు వివరించాడు. (1:2-3) పౌలు ఎల్లప్పుడు మూడు క్రైస్తవ కృపలను కలిపి వ్రాసేవాడు. (Iకొరి 13వ అధ్యా). విశ్వాసము క్రియకు భిన్నంగా కనిపిస్తుంది. కాని అది క్రియలను ఉత్పత్తి చేస్తుంది. ప్రేమ ప్రయాసకు భిన్నంగా కనిపిస్తుంది. కాని అది ప్రయాసపడేందుకు తోడ్పడుతుంది. నిరీక్షణ, ఓర్పుకు భిన్నంగా కనిపిస్తుంది. కాని అది ఓర్పును పుట్టిస్తుంది.

**2. ఎన్నుకొనబడిన సంఘము (1:4-5) :** పౌలు ముఖ్యంగా వారి ఎన్నికను గూర్చి జ్ఞాపకం చేస్తున్నాడు. ఈ ఎన్నిక వ్యక్తిగతమైనది మరియు సామూహికమైనది. అది క్రైస్తవునికి మరియు సమాజానికి కూడా వర్తిస్తుంది. ఈ ఎన్నికలో త్రిత్వం ప్రత్యక్షంగా పాల్గొన్నారు. జగత్తుపునాదికి ముందే తండ్రి వారిని ఏర్పరచుకొన్నాడు. (ఎఫె 1:4; II తిమో 1:9). కుమారుడు సిలువ ద్వారా రక్షణను కలుగజేసాడు. (గల 2:20) పరిశుద్ధాత్మ ద్వారా ఒప్పించబడి తీర్మాణం చేసికొన్న క్షణంలోనే వారు రక్షించబడ్డారు. (I కొరి 12:13)

**3. మాదిరికరమైన సంఘము (1:7) :** థెస్సలొనీకయులు మాసిదోనియలోని వారికందరికి మాదిరిగా ఉన్నారు. పౌలు కొరింథీయుల ఎదుట వారి మాదిరిని ఉంచాడు.

**4. ఆసక్తిగల సంఘము (1:8) :** వారియొద్ద నుండి ప్రభువు వాక్య బూర మాసిదోనియలోను, అకయలోను మ్రోగించబడింది. వారు క్రీస్తు బూర ధ్వని కోసం కనిపెడుతూనే క్రీస్తు కొరకు బూరనూదారు (I థెస్స 4:16; రోమా 1:8).

**5. కనిపెట్టిన సంఘము (1:9,10) :** ఈ భాగంలో సంఘము యొక్క త్రికాల స్థితి కనిపిస్తుంది. భూతకాలంలో వారు విగ్రహాలను విడిచిపెట్టి దేవుని వైపుకు తిరిగారు. వర్తమాన కాలంలో జీవముగల, సత్యవంతుడైన దేవునికి దాసులయ్యారు. భవిష్యత్తులో రానున్న యేసు కోసం ఎదురుచూసారు. దాన్నే పౌలు 3వ వచనంలో వర్ణించాడు.

**II. సంఘమును గూర్చిన సమీక్ష (I థెస్స 2 & 3 అధ్యా) :** అపొస్తలుల కార్యములు 17వ అధ్యాయంలో వ్రాయబడిన ప్రకారం, థెస్సలొనీక సంఘాన్ని స్థాపించుటలో పౌలుకు ఎదురైన పరిస్థితులను ఈ అధ్యాయాలలో పాఠకులకు జ్ఞాపకం చేస్తున్నాడు.

**1. కాపరిగా పౌలు పడిన ప్రయాస (2:1-12,17,19,20; 3:1-15, 7-13) :** ఈ భాగంలో పౌలు తన సేవను గూర్చి 10 ప్రాముఖ్యమైన విషయాలు వ్రాసాడు.

అతడు శ్రమానుభవమొందిన యాత్రికుడు (2:1,2) నమ్మకమైన గృహనిర్వాహకుడు (2:3-6). అతని బోధ, ఉద్దేశాలు, పద్ధతులు దేవునిచే ఆమోదించబడ్డాయి. సాధువైన తల్లివంటి ప్రేమ చూపించినవాడు (2:7-8). అలసిపోని పనివాడు (2:9). మాదిరియైన సేవకుడు(2:10) శ్రద్ధగల తండ్రి (2:11,12). పౌలు, తనను గూర్చి తల్లిగా, తండ్రిగా చెప్పుకోవడం పరిపాటి (I కొరి 4:14; I కొరి 6:13; గల 4:18, 19; ఫిలి 1:10). సహోదరుల విషయం బెంగగలవాడు (2:17). నిరీక్షణగల ఆత్మల సంపాదకుడు (2:19, 20). సౌవార్తిక ఉద్యమ నాయకుడు (3:1-5). గొప్ప ప్రార్ధనావీరుడు (3:7-13).

అవిశ్వాసులైన యూదుల ద్వారా పౌలు థెస్సలొనీక, బెరయ నుండి వెళ్ళగొట్టబడి ఏథెన్సుకు వెళ్ళాడు గాని, వారి యోగక్షేమాలు తెలుసుకోవడానాకి, వారిని బలపర్చడానికి తిమోతిని పంపించాడు. తాను పొందిన శ్రమలను బట్టి వారు బాధ పడవద్దని, అందుకే తాము నియమించబడ్డామని (3:3; యోహా 16:2; I కొరి 4:9; II తిమో 3:12; అపొ 9:16) ఈ శ్రమలను బట్టి వారు శోధింపబడవద్దని కోరాడు. అతడు వారితో ఉన్నప్పుడు కూడ శ్రమలను గూర్చి చెప్పాడు (3:4). అతడు చెప్పినట్లే వారికి సంభవించింది, శ్రమలు విశ్వాసం యొక్క వాస్తవికతను నిరూపిస్తాయి (I పేతు 1:7) శ్రమలలో ఉన్న ఇతరులను ఆదరించడానికి సిద్ధపరుస్తాయి (II కొరి 1:4) మన సహనాన్ని వృద్ధిచేస్తాయి (రోమా 5:3) సువార్త ప్రకటనకైన ఆసక్తిని పెంచుతాయి (అపొ 4:29; 5:27-29; 8:3, 4). జీవితంలోని మష్టును తొలగించుకోడానికి సహాయపడతాయి (యోబు 23:10).

**2. సంఘస్తుల ప్రయాస :** ఈ సంఘస్తులు శ్రమలలో సహితం, దేవుని వాక్యము సత్యమైనదని అంగీకరించారు. (2:13,14) పౌలు వారిని చూడాలని ఎంతగా ఆపేక్షిస్తున్నాడో వారు కూడా అతన్ని చూడాలని అంతగా అపేక్షిస్తున్నారు (3:6).

**3. సాతాను ప్రయత్నాలు (I థెస్స 2:15, 16) :** ఇక్కడ, మరియు ఇతర సందర్భాలలోను పౌలు ప్రస్తావించిన శత్రువులు యూదులే. సాతాను వీరిని ఏ విధంగా వాడుకుంటు తన ప్రయత్నాలను కొనసాగిస్తున్నాడో పౌలు వివరించాడు. సాతాను సాధనాలైన ఈ యూదులే యేసు ప్రభువును, పౌలును మరియు ఇతర అపొస్తలులను హింసించారు. సువార్త ప్రకటించకుండ ఆటంకపర్చారు. వారు దేవుని ఉగ్రతకే పాత్రులు. సాతాను యూదుల ద్వారా హింసించడమే కాక స్వయంగా కూడా పౌలును ఆటంకపరుస్తూవచ్చాడు. (I థెస్స 2:18).

**III. సంఘము ఎత్తబడుట (4 అధ్యా) :**

**1. సంఘము ఎత్తబడుటను గూర్చిన సవాళ్ళు (4:1-2)**

అ) సంఘము ఎత్తబడుతుంది అన్న సత్యము, క్రైస్తవుడు దేవుని చిత్తాన్ని తెలిసికొనేలా చేస్తుంది.

అనగా నేను ఏమి చెయ్యాలని దేవుడు కోరుతున్నాడు? అన్న ప్రశ్న విశ్వాసిలో కలుగుతుంది. ప్రతి విశ్వాసి పరిశుద్ధంగా ఉండాలన్నదే దేవుని చిత్తం (I థెస్స 4:3).

ఆ) సంఘము ఎత్తబడుతుంది అన్న తలంపు క్రైస్తవుడు దేవుని మార్గాలను తెలిసికొనేందుకు అనగా నేను చేయవలసిన దానిని ఎలా చెయ్యాలని దేవుడు కోరుతున్నాడు? అని ప్రతి విశ్వాసి ప్రశ్నించుకొని, సరిచేసుకోడానికి సహాయపడుతుంది. విశ్వాసులు అపవిత్రతకు (జారత్వానికి) దూరంగా ఉండుట వలన (4:3) సహోదరుని మోసము చేయకుండుట వలన (4:6) తన సహోదరుణ్ణి ప్రేమించుట వలన (4:9) పనిచేయుటకు ఆశకలిగియుండుట వలన (4:11,12) దేవుని చిత్తములో ఉంటూ క్రీస్తు రాకడలో ఎత్తబడేందుకు సిద్ధపడి ఉండాలి.

**2. సంఘము ఎత్తబడే విధానము - క్రమము (I థెస్స 4:13-18) :** థెస్సలొనీక సంఘంలోని విశ్వాసులను వేధిస్తూ ఉన్న ఒక ప్రశ్నకు పౌలు ఈ భాగములో జవాబు చెప్పాడు. పౌలు వారితో ఉన్న కాలంలో, క్రీస్తు మహిమాన్విత రాకడను గూర్చి, ఈ భూమి మీద ఆయన రాజ్య స్థాపనను గూర్చి వారు బాగా తెలుసుకున్నారు. అయితే పౌలు వారిని విడిచివెళ్ళిపోయాక విశ్వాసులలో అనేకులు చనిపోయారు. అప్పుడు వారిలో ఒక ప్రశ్న తల ఎత్తింది. క్రీస్తు తిరిగి వచ్చినప్పుడు వారికి ఏమి జరుగుతుంది? కనుక పౌలు క్రీస్తు రాకడలోని సంఘటనల క్రమాన్ని వారికి వివరించాల్సివచ్చింది.

**అ) ఒక గ్రహింపు (4:12) :** నిరీక్షణలేని ఇతరుల వలె విశ్వాసులు దుఃఖించకుండ ఉండాలంటే, క్రీస్తునందుండి మృతులైన వారిని గూర్చిన గ్రహింపు ఉండాలి.

**ఆ) ఒక విశ్రాంతి (4:14):** ఇక్కడ విశ్వాసి మరణం విశ్రాంతితో కూడిన నిద్రతో పోల్చబడింది (మత్త 27:52; యోహా 11:11; అపో.కా. 7:60; 13:36; I కొరి 15:6, 18, 20, 51; II పేతు 3:4). ఈ నిద్ర శరీరానికి సంబంధించినదే గాని ఆత్మకు కాదు. ఆత్మ నిద్రించదు (మత్త 17:3; ప్రక 6:9-11).

**ఇ) ఒక ప్రత్యేకత (4:15):** క్రీస్తు వచ్చిన సమయంలో సజీవులుగా ఉన్నవారు నిద్రించినవారి కంటె ముందుగా ఎత్తబడరు.

**ఈ) ఒక పునరాగమనము (4:16) :** ప్రధాన దూత శబ్దముతోను, దేవుని బూరతోను పరలోకము నుండి ప్రభువు దిగివస్తాడు. దానియేలు 12:1,2ను బట్టి ఆ ప్రధాన దూత మిఖాయేలు కావచ్చునని ఒక అభిప్రాయం, గబ్రియేలు యేసు మొదటి రాకలో పాత్రవహించాడు గనుక రెండవ రాకడలోను ఆయన పాత్ర ఉండవచ్చునని మరో అభిప్రాయం ఉన్నది.

**ఉ) ఒక పునరుత్థానం (4:16):** ప్రభువు దిగివచ్చినపుడు, క్రీస్తు నందుండి మృతులైనవారు మొదట లేస్తారు.

**ఊ) పునః ఐక్యత (4:17) :** తరువాత సజీవులై నిలిచి ఉన్న విశ్వాసులు వారితో కూడ, ప్రభువును ఎదుర్కోడానికి మేఘం మీద కొనిపోబడతారు. అందరు కలిసి సదాకాలము ప్రభువుతో ఉంటారు.

**ఎ) పునః నిశ్చయత (4:18) :** ఈ నిశ్చయతే క్రైస్తవ విశ్వాసానికి మూలము. కనుక ఈ మాటలచేత ఒకరినొకరు ఆదరించుకోవాలి ప్రోత్సహించుకోవాలి.

**IV. సంఘము బాధ్యత (5వ అధ్యా) :** ఈ అధ్యాయంలో క్రీస్తు కొరకు, నిరీక్షణతో కనిపెడుతున్న విశ్వాసుల బాధ్యతలేంటో పౌలు పేర్కొన్నాడు.

1. **మెలకువగా ఉండాలి (5:1-11) :** విశ్వాసులు ఇతరుల వలె నిద్రించక క్రీస్తు మహిమ రాకడకై కనిపెట్టాలి. ఎందుచేతనంతే మనం పగటి వారము, వెలుగు సంబంధులం గనుక, మనమేమైయున్నామో దానిని బట్టి మెలకువగా ఉండాలి (5:5). నీతిసూర్యుడు ఉదయించే దినము కొరకు కనిపెట్టాలి (మలా 4:2). అంతమాత్రమే కాదు ఆకస్మికంగా కలిగే ఉపద్రవాన్ని తప్పించుకొనేందుకే మెలకువగా ఉండాలి (5:2,3). దేవుడు, మనలను ఉగ్రత పాలవడానికి నియమించలేదు (5:9) ఈ ఉగ్రత బాహ్య సంబంధమైనది (యోహా 3:36; కొల 3:6). మరియు మహాశ్రమలకాలానికి సంబంధించినది. మనం చనిపోయినా జీవించి ఉన్నా ఆయనతో జీవించేందుకే యేసు గొప్ప క్రయధనాన్ని చెల్లించాడు (5:10). చనిపోయిన క్రైస్తవుడు దేనిని పోగొట్టుకోడు (యోహా 11:25, 26). ఆయన రాకడ సమయంలో తిరిగి లేస్తాడు. అలాగే బ్రతికి ఆయనయందు విశ్వసించినవాడు ఎత్తబడతాడు గనుక ఎన్నడూ చనిపోడు.
2. **బుద్ధిచెప్పే వారిని మన్నన చేయాలి (5:12,13) :** ప్రతి విశ్వాసి తనపై నాయకులను గౌరవించాలి. వారు ఆత్మీయ నాయకులు గనుక (హెబ్రీ 13:7-9, 14, 17; I పేతు 5:1-5).
3. **మంచి బుద్ది కలిగి ఉండాలి (5:14, 15) :** ఈ భాగంలో ఏమేమి చేయాలో, ఏమి చేయకూడదో వ్రాసాడు.
4. **ఎల్లప్పుడు సంతోషంగా ఉండాలి (5:16).**
5. **ఎడతెగక ప్రార్థించాలి (5:17) :** ఎడతెగక అనే మాటకు ఉపయోగించబడిన గ్రీకు పదానికి పొడిదగ్గు అని అర్థం. ఈ దగ్గు ఉన్నవాళ్ళు పైకి వినిపించేలా దగ్గరు కాని, ఈ దగ్గు లక్షణాలు వారిలో ఎప్పుడూ ఉంటాయి. అలాగే ఎడతెగక ప్రార్థించేవారు, పైకి వినిపించేలా, కనిపించేలా ప్రార్థించకున్నా వారి హృదయం ఎప్పుడూ ప్రార్థనతోనే నిండి ఉంటుంది.
6. **కృతజ్ఞత కలిగి ఉండాలి (5:18) :** ప్రతి విషయంలో కృతజ్ఞత చెల్లించాలన్న ఈ ఆజ్ఞ యొక్క ప్రాధాన్యతను నిర్లక్ష్యం చేయకూడదు (ఎఫె 5:20; కొల 3:17; ఫిలి 4:6). దేవుణ్ణి ఎరిగి ఉండి కూడ ఆయనను దేవునిగా ఘనపరచకపోవడం, కృతజ్ఞత చెల్లించకపోవడమే గర్వము (రోమా 1:21). కనుక మనలోని గర్వం పోవడానికి, కృతజ్ఞత చెల్లించడం ఎంతో అవసరం.
7. **నమ్మకంగా ఉండాలి (5:19-28) :** విశ్వాసులు తమలో ఉన్న పరిశుద్ధాత్మను ఆర్పకూడదు (5:19). దేవుడు మనల్ని చెయ్యమన్న దానిని చేయకుండడమే ఆత్మను ఆర్పుట. అలాగే ప్రవచించుటను నిర్లక్ష్యం చేయవద్దు. (5:20) ఈ విషయంలో కొరింథీయులు విపరీత ధోరణిలో ప్రవర్తించారు. (I కొరి 14 అధ్యా). థెస్సలొనీకయులు దానికి ప్రాధ్యాన్యతనే ఇవ్వలేదు. కనుక నిర్లక్ష్యం చేయవద్దని పౌలు కోరాడు. సమస్తమును పరీక్షించి మేలైన దానిని చేపట్టాలి (5:21) ప్రతి విధమైన కీడుకు దూరంగా ఉండాలి (5:22). ముగింపులో పౌలు దేవుని పోలికలో చేయబడిన మనిషి త్రిభాగి అన్న సిద్ధాంతాన్ని బలపరుస్తూ (5:23-28), ప్రస్తుతం దేవుడు విశ్వాసుల ఆత్మ, జీవము, శరీరమును సంపూర్ణంగా శుద్ధీకరించే పనిలోనే నిమగ్నమైయున్నాడని జ్ఞాపకం చేసాడు.

**D. థెస్సలొనీకయులకు వ్రాసిన రెండవ పత్రిక విభజన.**

**I. విశ్వాసుల ప్రస్తుత హింసలు, రాబోవు కాలంలో (క్రీస్తు రాకడలో) అవిశ్వాసుల తీర్పు**

1. ఉపోద్ఘాతం (1:3-7)
2. విశ్వాసుల హింసలు వాటి ఫలితాలు. (1:3-7)
3. క్రీస్తు రాకడలో దుష్టుల తీర్పు. (1:8-12)

**II. క్రీస్తు రాకడకు సంబంధించి, లోకమును గూర్చిన కార్యక్రమము - 2:1-2**

1. మొదట సంఘం ఎత్తబడుతుంది. (2:1)
2. తరువాత ప్రభువు దినం వస్తుంది. అది సంపూర్ణ భ్రష్టత్వం మరియు పాపపురుషుడు బయలు పడుటను బట్టి ఆరంభమౌతుంది. (2:2-5)
3. ఇప్పటికే క్రియ చేస్తున్న ధర్మవిరోధ సంబంధమైన మర్మము మరియు ధర్మవిరోధి పరిశుద్ధాత్మునిచే అడ్డగింపబడుట (2:6-8)
4. మహాశ్రమల కాలంలో రానున్న ధర్మ విరోధి (2:9-12)

**III. క్రీస్తు రాకడ యొక్క ప్రయోగాత్మకత - 2:13 - 3:18**

1. విశ్వాసులు వాక్యంలో స్థిరపరచబడాలి (2:13-17)
2. విశ్వాసులు నడతలో స్థిరపరచబడాలి (3:1-7)
3. విశ్వాసులు పనిలో స్థిరపరచబడాలి (3:8-18)

**E. అంశాలవారిగా సంగ్రహ సమీక్ష :**

**I.** క్రీస్తు పునరాగమనము కాపరికి ప్రోత్సాహము. (అది మహిమాన్వితమైనది). - **II** థెస్స 1 అధ్యా. ప్రభువైన యేసు క్రీస్తు రాకడ, ఒక కాపరిగా పౌలుకు ప్రోత్సాహాన్ని ఇచ్చింది. థెస్సలొనీకయ విశ్వాసులు, తమ విశ్వాసాన్ని బట్టి ఘోర హింసలకు గురి అయ్యారు. అయితే వారికున్న అపోహను తొలగించడానికి అది మహాశ్రమల కాలం కాదని, దానికి ముందుగానే వారికి ఎందుకు శ్రమలు అనుమతించబడ్డాయో పౌలు వివరించాడు.

**ఎ. మనుష్యుల వలన కలిగిన శ్రమలు :** ఈ శ్రమలు వారు విశ్వాసంతో ఎదగడానికి, ప్రేమలో నిలిచి ఉండడానికి (**II** థెస్స 1:3) సహనాన్ని వృద్ధి చేసికోడానికి (1:4) దేవుని రాజ్యం కొరకు సిద్ధపడడానికి (1:5) సహాయపడ్డాయి. వీటిని బట్టి ఈ సంఘస్తుల ద్వారా క్రీస్తు మహిమ పరచబడ్డాడు. (1:12).

**బి. శ్రమల ద్వారా విశ్వాసికి కలిగే ఘనత (1:6-8) :** క్రీస్తు కొరకు శ్రమలు అనుభవించిన విశ్వాసులకు ప్రభువు వచ్చినపుడు విశ్రాంతినిస్తాడు. వారిని శ్రమ పరచిన వారు దేవుని ఉగ్రతకు లోనౌతారు గాని, శ్రమపొందినవారు దానిని తప్పించుకొంటారు. దేవుని ఎరుగనివారు మరియు సువార్తకు లోబడనివారు శిక్షించబడతారు (1:10).

**II.** దేవుని ఉగ్రత ఒక ప్రవచనాత్మకమైన జ్ఞానోదయం. (అది మహాశ్రమల కాలం) (**II** థెస్స 2 అధ్యా).

**ఎ. ప్రభువు దినమును గూర్చిన సత్యాలు (2:1-12)**

1. **ప్రభువు దినము మరియు సంఘము (2:1-3) :** ఈ భాగంలో క్రీస్తుదినము, ప్రభువు దినము అని తర్జుమా చేయబడింది. ఈ రెండింటికి ఎంతో వ్యత్యాసం ఉన్నది. ప్రభువు దినము 7 సంవత్సరాల మహాశ్రమల కాలాన్ని సూచిస్తున్నది. (యోవే 1:15; 2:1,2; ప్రక 6:12-17). క్రీస్తు దినం వెయ్యేండ్ల పాలనను సూచిస్తున్నది. (**I** కొరి. 1:8; 5:5; ఫిలి 1:6, 10; 2:16) ప్రభువు దినమును గూర్చి ఎవరు, ఎలా చెప్పినా నమ్మవద్దని పౌలు హెచ్చరించాడు. అంతమాత్రమే కాదు అది ఎప్పుడు వస్తుందో కూడ తెలియజేసాడు. మొదట భ్రష్టత్వం సంభవిస్తుంది. (**I** తిమో 4:1, **II** తిమో 3:1-5; 4:3, 4). అయితే ప్రభువు దినానికి మరియు సంఘానికి ఉన్న సంబంధం ఏంటి? అంటే సంఘము ఎత్తబడేంత వరకు ప్రభువు దినము రాదు.

2. **ప్రభువు దినము మరియు క్రీస్తు విరోధి (2:3-9) :** క్రీస్తు విరోధి, పేరే వాని స్వభావాన్ని తెలియజేస్తున్నది. వాడు దేవుణ్ణి ఎదిరించి, పూజించబడే వాటన్నికంటె పైగా తన్నుతాను హెచ్చించుకుంటాడు (దాని 11:36,37; ప్రక 13:15,16). యూదుల అతి పరిశుద్ధ స్థలాన్ని ఆక్రమించుకొంటాడు (మత్త 24:15), వాడే దేవుడని చెప్పుకుంటాడు (దాని 7:8, 20, 25). సాతాను వలన అధికారాన్ని శక్తినిపొంది (ప్రక 13:4) అద్భుతాలను, సూచనలను చేస్తాడు (ప్రక 13:13,14) వానికి జరుగబోయే తీర్పును గూర్చి **II** థెస్స 2:8లో వ్రాయబడింది (దాని 8:25; 11:45; ప్రక 19:20 కూడ చూడండి).

3. **ప్రభువు దినము మరియు అడ్డగించువాడు (2:6,7) :** క్రీస్తు విరోధి తన సొంత కాలమందు సంపూర్ణ బలాన్ని ప్రదర్శించేంత వరకు, అడ్డగించేవాడు వాని శక్తిని నిరోధిస్తూనే ఉంటాడు. అడ్డగించేవాడు అంటే, మానవ ప్రభుత్వం అని (మత్త 4:8), దేవదూతలు అని (యూదా 9వ) కొంతమంది అభిప్రాయం. డా॥ చార్లెస్ రైరీ అనే పండితుడు, అది సంఘమేనని చెప్పాడు. అయితే వీటన్నిటి కంటె, పరిశుద్ధాత్మ, శక్తి అనడమే సమంజసంగా ఉన్నది.

4. **ప్రభువు దినము మరియు అవిశ్వాసులు (2:10-12) :** అవిశ్వాసులను మోసముచేసే శక్తిని దేవుడే పంపుతున్నాడు. ఈ వచనాలు దేవుని సార్వభౌమత్వాన్ని, రక్షించబడని వారి గతిని, భ్రష్టులైన దూతల కార్యాలను వెల్లడిస్తున్నవి.

B. **ప్రభువుచే ప్రేమించబడిన వారి విషయాలు (I థెస్స 2:13-18) :** ఇంతకు ముందు భాగములో పౌలు, రక్షించబడని వారికి కలిగే నిత్య నాశనాన్ని గూర్చి చెప్పాడు. (1:9) ఈ భాగంలో రక్షించబడిన వారి నిత్య రక్షణను గూర్చి చెప్తున్నాడు. ఇందులో రక్షణ మూలమును గూర్చి, రక్షణ పొందిన విధానమును గూర్చి, రక్షణ పొందగల మార్గమును గూర్చి (2:13). రక్షణ యొక్క లక్ష్యమును గూర్చి (2:14) మరియు రక్షణలోని బాధ్యతలను గూర్చి (2:15) చెప్పాడు.

**VII. ఆచరణాత్మక బోధ (II థెస్స 3వ అధ్యా) :**

ఈ చివరి అధ్యాయంలో పౌలు చేసిన మనవి (3:1,2), పునర్నిశ్చయత (3:3-5) కొన్ని

చీవాట్లు (3:6,11-15) ఉన్నాయి. గద్దించబడిన వారిలో అక్రమముగా నడచుకొనేవారు (3:6) పరుల జోలికి పోయేవారు (3:11), పనిచేయని బద్ధకస్తులు (3:10) అవిధేయులు (3:14) ఉన్నారు. తాను గద్దించడమే కాక, వారు ఒకరికొకరు బుద్ధి చెప్పుకోవాలని కూడ చెప్పాడు. ఈ విషయంలో వారిని కనిపెట్టి గుర్తించి (3:14) వారి తప్పులను బట్టి గద్దించాలి (3:15) అయినా మారని పక్షంలో అలాంటి వారితో సాంగత్యం చెయ్యవద్దని (3:6,14) అయినా వారిని శత్రువులుగా భావించక సహోదరులుగా భావించాలని చెప్పాడు. (3:15) వారు ఎలా పౌలును పోలి నడచుకోవాలో నేర్పించాడు. పౌలు ప్రవర్తన వారికి బాగా తెలుసు (3:7-10) అట్టి మాదిరి కలిగి ప్రతి విశ్వాసి రాబోయే ఆ గొప్ప సంఘటన కోసం సిద్ధపడే కృపను ప్రభువు దయచేయునుగాక!

---

# గొప్ప సలహాలు

## తిమోతికి మరియు తీతుకు వ్రాసిన పత్రికల సంగ్రహ సమీక్ష

I. **ఉపోద్ఘాతం**

**1. గ్రంథకర్త :** అపొస్తలుడైన పౌలు (I తిమోతి 1:1,2; 2 తిమోతి 1:1; తీతు 1:1-4)

**2. పాఠములు :** పౌలు పరిచర్యలో సహకారులుగా ఉన్న తిమోతి మరియు తీతు అనే యౌవనస్థులకు ఈ పత్రికలు వ్రాయబడ్డాయి. వీరిద్దరూ పౌలు పరిచర్య ద్వారా రక్షించబడ్డారు. కనుక వారిని పౌలు నా కుమారులు అని పిలిచాడు.

**ఎ. తిమోతి :** తిమోతి తండ్రి గ్రీసుదేశస్థుడు, తల్లి యూదురాలు. ఇతడు లుస్త్ర వాస్తవ్యుడు. (అపొ.కా. 16:1; తిమో 1:5) ఇతని తల్లి ఎప్పుడు క్రైస్తవురాలైందో తెలియదు గాని, పౌలు తన మొదటి మిషనెరీ యాత్రలో లుస్త్రకు వచ్చినప్పుడు తిమోతి ప్రభువును అంగీకరించియుండ వచ్చును (2 తిమో 3:11) పౌలు తన ప్రయాణాలతో తిమోతిని కూడ వెంటబెట్టుకొని వెళ్ళాడు (I తిమో 1:18; 4:14). స్థానిక యూదులకు అభ్యంతరం లేకుండ ఉండడానికి పౌలు ఇతనికి సున్నతి జరిపించాడు. (అపొ. 16:3-5). ఇతడు పౌలుతో పాటు కొరింథుకు (2కొరింథీ. 1:19) యెరూషలేముకు వెళ్ళాడు (అపొ. 20-4). థెస్సలోనికయులను హెచ్చరించడానికి పంపించబడ్డాడు. (1 థెస్స 3:1-4). పౌలు తరచుగా ఇతన్ని మందలించేవాడు. (2తిమో 1:8; 2:22). నమ్మకత్వం విషయంలో మాత్రం ఇతన్ని మెచ్చుకున్నంతగా మరెవర్నీ మెచ్చుకోలేదు (ఫిలిప్పీ 2:19). తిమోతి కొంతకాలం చెరసాలలో ఉన్నాడు (హెబ్రీ 13:23). ఇతని చివరి దినాలను గూర్చిన వివరాలు తెలియవు.

**బి. తీతు :** తీతును గూర్చిన ప్రస్తావన పౌలు పరిచర్యను వివరించే అపొస్తలుల కార్యముల గ్రంథంలో లేనప్పటికీ, పౌలుకున్న నమ్మకమైన యూదేతర స్నేహితులలో తీతు ఒకడు. యూదేతరుల సున్నతి విషయం వివాదం జరిగిన సమయంలో ఇతడు, పౌలు బర్నబాలతో కలసి యెరూషలేముకు వచ్చాడు (గలతీ 2:1-3).

పౌలుకు, కొరింథీ సంఘానికి మధ్య ఉన్న కలవరాలను భేదాభిప్రాయాలను తొలగించే సున్నితమైన పనిని నెరవేర్చడానికి ఇతడు పౌలుకు ప్రతినిధిగా కొరింథు పట్టణానికి వెళ్ళాడు (2కొరింథీ. 2:12; 7:6,7) ఈ అధ్యాయాలను బట్టి ఇతడు ఒక లేఖను

తీసుకొని వెళ్ళాడని తెలుస్తున్నది. అయితే ఆ లేఖ ఇంతవరకు దొరకలేదు. పౌలు తీతుకు వ్రాసిన లేఖను బట్టి ఇతడు పౌలుతో కలిసి క్రేతు వరకు ప్రయాణించాడని, క్రేతు సంఘంలోని లోపాలను సరిదిద్దాడని తెలుస్తుంది (తీతు 1:5,12). ఇతడు యథార్థపరుడు (2 కొరింథీ 12:18). తిమోతికన్న బలమైన వ్యక్తిత్వం గలవాడు. 2 కొరింథీ 7:13-15 పోల్చిచూడండి.

**3. వ్రాయబడిన కాలం :** ఈ మూడు పత్రికలు వ్రాయబడిన కాలాన్ని గుర్తించాలంటే, పౌలు జీవిత సంఘటనల క్రమాన్ని తెలిసికోవడం అవసరం.

★ క్రీ.శ. 58 సం॥లో పౌలు, యోరుషలేము పట్టణంలో బంధించబడ్డాడు (అపో.కా. 21:27-35).

★ క్రీ.శ. 61 సం॥లో రోమా పట్టణానికి వెళ్ళాడు (అపో.కా. 23:23-33).

★ క్రీ.శ. 61-63 సం॥లో పౌలు మొదట చెరసాలలో ఉన్న కాలంలో పలు రోమా అధికారుల యొద్దకు తీర్పు నిమిత్తం వెళ్ళాడు. (అపో. 24:1,22, 25; 26 అధ్యా).

★ క్రీ.శ. 64-67 సం॥ కాలంలో పౌలు విడుదల పొంది మాసిదోనియ ప్రాంతంలో ఎక్కువగా ప్రయాణించాడు. 1 తిమోతి, మరియు తీతు పత్రికలు మాసిదోనియా నుండే వ్రాసాడు.

★ క్రీ.శ. 67 సం॥లో తిరిగి బంధించబడ్డాడు.

★ క్రీ.శ. 68 సం॥లో శిరచ్ఛేదనం చేయబడ్డాడు. కనుక దానికి ముందుగానే 2 తిమోతి పత్రికను వ్రాసివుండవచ్చును.

**4. పత్రికల సారాంశం :** తిమోతికి మరియు తీతుకు వ్రాయబడిన పత్రికలలో స్థానిక సంఘాలను గూర్చిన విషయాలు పేర్కొనబడ్డాయి గనుక అవి కాపరుల పత్రికలు అని పిలువబడుతున్నాయి. ఈ పత్రికలలో పౌలు రెండు ప్రాముఖ్యమైన విషయాలను పేర్కొన్నాడు. సంఘములో జరిగే ఆరాధన క్రమమైనదిగా ఉండాలన్న ఉద్దేశంతో పౌలు సంఘం యొక్క నియమావళిని గూర్చి (The creed of the Church) మరియు సంఘం ప్రవర్తించాల్సిన విధానాన్ని గూర్చి (The conduct of the Church) నొక్కివక్కాణించాడు. సంఘం లోపల ఆరాధన జరగాలి, సంఘం వెలుపల సత్క్రియలు చేయబడాలి. ఆ విధంగా సంఘం లోకములో ప్రత్యక్షపరచుకోవాలి. వారి ప్రవర్తన ద్వారా లోకానికి దేవుణ్ణి ప్రత్యక్షపర్చాలి. సంఘంలోపల క్రమమును గూర్చిన సూత్రాలు మరియు సంఘం వెలుపల సత్క్రియలు ఈ రెండు ప్రాముఖ్యమైనవి. వీటిని గూర్చే పౌలు ఈ మూడు పత్రికలలో వివరించాడు.

**5. పత్రికల విశిష్టత :** క్రైస్తవ సంఘము సత్యమునకు స్తంభమును ఆధారమునైయున్నది (1తిమో 3:15). అలాంటి సంఘానికి సంఘ పెద్దలు స్తంభాలుగా ఉన్నారు (గలతీ 2:8). సంఘానికి స్తంభాలుగా ఉండాల్సిన సంఘపాలకులు ఎలా ఉండాలో 1 తిమోతి పత్రిక వివరిస్తుంది. 2 తిమోతి పత్రిక నమ్మకత్వాన్ని గూర్చి ఎక్కువగా నొక్కివక్కాణిస్తుంది. సంఘం శ్రమలలో (1అధ్యా), పరిచర్యలో (2 అధ్యా), ఆత్మీయభ్రష్టత సంభవించినపుడు సయితం నమ్మకంగా ఉండాలని (3 అధ్యా) బోధిస్తున్నది. అంత మాత్రమే కాదు తన సేవకులు విడిచిపెట్టబడినప్పుడు వారిపట్ల ప్రభువు చూపించే నమ్మకత్వాన్ని గూర్చి కూడ తెలియజేస్తుంది (4 అధ్యా). తిమోతికి వ్రాసిన రెండవ పత్రిక పౌలు అవసానదశలో

వ్రాయబడింది గనుక అందులోని 4వ అధ్యాయంలో దాదాపు 25 వచనాలలో పౌలు వ్యక్తిగత విషయాలు వ్రాయబడ్డాయి. పౌలు ఈ పత్రిక చివరలో వ్రాసిన తుది పలుకులు ఎంతో శ్రేష్ఠమైనవి. ఆ పలుకులలో ఏ మాత్రం దుఃఖం గోచరించడం లేదు. పైగా విజయోత్సాహంతో వేసిన గొప్ప కేకగా వాటిని పరిగణించవచ్చును. **మంచి పోరాటమును పోరాడితివి, నాపరుగు కడముట్టించితివి, విశ్వాసమును కాపాడుకొంటిని** (2తిమో 4:7).

ఇక తీతుకు వ్రాసిన పత్రికలో మంచి సంఘం యొక్క లక్షణాలు వ్రాయబడ్డాయి. సరైన సంఘం క్రమమైన నిర్వహణ (An orderly organization), సరైన సిద్ధాంతం (Sound Doctrine) కలిగి వుండాలి. మరియు పవిత్రమైన జీవితం కలిగి ప్రతిసత్కార్యం కొరకు సిద్ధముగా ఉండాలి. తీతుకు వ్రాసిన పత్రికలో పేర్కొనబడిన క్రొత్త నిబంధన సంఘం యొక్క దృశ్యమిది.

## II. పత్రికల విభజన

### అ. 1తిమోతి పత్రిక విభజన

**1. సంఘం యొక్క విశ్వాసం - 1 అధ్యా**
ఉపోద్ఘాతం - 1:1,2; తప్పు సిద్ధాంతమును గూర్చిన హెచ్చరిక - 1:3-10;
పౌలు వ్యక్తిగత సాక్ష్యం - 1:11-17; తిమోతికి అధికారమిచ్చుట - 1:18-20.

**2. సంఘ సభ్యుల ప్రార్థన మరియు స్త్రీ స్థానం - 2 అధ్యా.**
సంఘ సభ్యుల మరియు నాయకుల బహిరంగ ప్రార్థన - 2:1-7;
పురుషులు ప్రార్థించాల్సిన విధానం - 2:8; స్త్రీలు ప్రార్థించాల్సిన విధానం - 2:9-15

**3. సంఘ పరిపాలక వర్గం - 3 అధ్యా**
సంఘ పెద్దలకు ఉండాల్సిన అర్హతలు - 3:1-7; సంఘ పరిచారకులకు ఉండాల్సిన అర్హతలు - 3:8-13; పౌలు తిమోతికి వ్రాసిన నివేదిక - 3:14-16.

**4. సంఘంలో ఆత్మీయభ్రష్టత - 4 అధ్యా**
ఆత్మీయ భ్రష్టతను ఎలా గుర్తించాలి - 4:1-5;
ఆత్మీయ భ్రష్టత కలిగినపుడు మంచి సేవకుడు ఏమి చెయ్యాలి - 4:6-16

**5. సంఘపాలకుల విధులు - 5, 6 అధ్యా**
స్థానిక సంఘంలోని పలువర్గ ప్రజలతో నాయకులకు ఉండాల్సిన సంబంధం - 5 అధ్యా; విశ్వాసులకు సహ విశ్వాసులతో ఉండాల్సిన సంబంధం - 6 అధ్యా.

### ఆ. 2 తిమోతి పత్రిక విభజన

**1. సువార్త నిమిత్తమైన శ్రమలు - 1 అధ్యా**
ఉపోద్ఘాతం - 1:1-7; శ్రమలను గూర్చి సిగ్గుపడక, వాటిలో పాలిభాగస్తులైయుండుట - 1:8-11; శ్రమలను గూర్చి సిగ్గుపడకుండ, శ్రమలలో సయితం నిశ్చయిత కలిగియుండుట - 1:12-18;

**2. పరిచర్యలో చురుకుదనం - 2 అధ్యా**
కుమారునిగా - 2:1,2; సైనికునిగా - 2:3,4; పందెగానిగా (జెట్టిగా) - 2:5;
వ్యవసాయకునిగా - 2:6-10; పనివానిగా (ఉపదేశకునిగా) - 2:11-14;
విద్యార్థిగా - 2:15-19; పాత్రగా - 2:20-23; దాసునిగా - 2:24-26.

**3. రాబోయే ఆత్మీయ భ్రష్టత - లేఖనాల శక్తి - 3:1-4:5**
అంత్య దినాల పరిస్థితులు - 3:1-9; అంత్య దినాలలో లేఖనాల శక్తి - 3:10-17; అంత్య దినాలను గూర్చి సూచనలు - 4:1-5.

**4. ప్రభువు కొరకు నమ్మకత్వం మరియు ప్రభువు యొక్క నమ్మకత్వం - 4:6-22**
మరణ శయ్యపైనున్న పౌలు సాక్ష్యం - 4:6-8;
పౌలు తుది పలుకులు (ప్రభువు నా ప్రక్కను నిలిచి) - 4:9-22

**ఇ. తీతు పత్రిక విభజన**

**1. సంఘము ఒక సంస్థ - 1 అధ్యా**
ఉపోద్ఘాతం - 1:1-4; క్రమబద్ధమైన సంఘంలో, నియమిత అక్కరలు తీర్చగల అభిషేకించబడిన పెద్దల అవసరత - 1:5-9; క్రేతీయుల చెడ్డ సాక్ష్యం - 1:10-16

**2. సంఘం దేవుని వాక్యాన్ని బోధించాలి మరియు ఉపదేశించాలి - 2 అధ్యా**
సంఘం సరైన సిద్ధాంతాన్ని ఉపదేశించాలి - 2:1-10;
సంఘం దేవుని కృపను గూర్చి బోధించాలి - 2:11-15;

**3. సంఘం సత్క్రియలు చెయ్యాలి - 3 అధ్యా**
సత్క్రియలు (పరిశుద్ధాత్మ కార్యాలు) రక్షణ కార్యానికి నిదర్శనం - 3:1-7;
సత్క్రియలు ప్రస్తుత కాలానికి మరియు భవిష్యత్తుకు కూడా మేలురమైనవి - 3:8-15.

III. **అంశాల వారిగా విభజన :** తిమోతికి వ్రాయబడిన రెండు పత్రికలు మరియు తీతుకు వ్రాయబడిన పత్రికలోని ప్రధానాంశాలన్నీ దరిదాపుగా స్థానిక సంఘమును గూర్చినవే. వీటిని పత్రికల వారిగా కాక, అంశాల వారిగా ధ్యానించడం సులభం. గనుక ప్రతి అంశమును గూర్చి, మూడు పత్రికలలో నుండి ఇవ్వబడిన వాక్యభాగాలను చదువగలరు. సంఘం ఒక సజీవ నిర్మాణం (Living Organism) మరియు అదృశ్యమైనది అయినప్పటికినీ, ఈ లోకంలో ఒక దృశ్యమైన వ్యవస్థగా లేక సంస్థగా ఉన్నది. ప్రతి సంస్థ సక్రమంగా నిర్వహించబడడానికి ఖచ్చితమైన నియమ నిబంధనలు, పరిపాలక వర్గం అనగా కార్యనిర్వాహకులు, నిర్దుష్టమైన లక్ష్యాలుండాలి, లక్ష్యసాధనకు తగిన సాధనాలుండాలి.

జీవముగల దేవుని సంఘానికి దైవ సిద్ధాంతమే నియమావళిగా, దైవాభిషిక్తులైన వారే కార్యనిర్వాహకులుగా దేవుని వాక్యమే సాధనముగా ఉండాలి. దేవుని కుటుంబముగా పిలువబడుతున్న సంఘముతో ఉండవలసిన సంబంధాన్ని ఈ పత్రికలు స్పష్టంగా విశదీకరిస్తున్నాయి.

**అ. దేవుని సంఘము మరియు రక్షకుడు**

సంఘస్థాపకుడు మరియు సంఘానికి శిరస్సుగానున్న యేసు క్రీస్తును గూర్చి పౌలు ఈ పత్రికలలో వివరించిన విధానం క్లుప్తంగా ఉన్నా సువార్త సారాంశాన్నంతా దానిలో గుప్పించాడు. యేసు క్రీస్తు దైవత్వమును గూర్చి (1తిమో 1:17; తీతు 2:13; 6:5). ఆయన ఈ లోకానికి వచ్చిన ఉద్దేశము (1 తిమో 1:15; 4:10). ఆయన మానవావతారము (1 తిమో 3:16, తీతు 2:11; 3:4). విజవంతమైన పరిచర్య (1తిమో

3:16; 2తిమో 1:10, 11) ఆయన శ్రమలు మరియు మరణం (1తిమో 2:16; తీతు 2:14) ఆయన పునరుత్థానము మరియు ఆరోహణము (1తిమో 3:16; 2 తిమో 1:10). ఆయన మధ్యవర్తిత్వం (1తిమో 2:5). ఆయన రాకడ 1తిమో 6:14; తీతు 2:13) ఆయన తీర్పు (2 తిమో 4:1,8) మరియు వెయ్యేండ్ల పాలన గూర్చి (1తిమో 6:15) ఈ పత్రికలలో సందర్భానుసారంగా ప్రస్తావించాడు.

**ఆ. దేవుని సంఘము మరియు పౌలు**

సేవకునిగా పౌలు దేవుని సంఘంతో కలిగివున్న సంబంధంలో ఓ మంచి బోధకునిగా ఉపదేశకునిగా ఉన్నాడు. (2 తిమో 1:11; తీతు 1:4). అతని బోధ అంతా రక్షణ సువార్త గూర్చే (1తిమో 1:11,15) అన్యజనులే అతని సువార్త క్షేత్రం (1తిమో 2:7). అతని యజమాని రక్షకుడైన యేసు (1తిమో 1:1; 4:10; 2 తిమో 1:9; తీతు 1:4; 2:10; 3:4). అతని బోధలో సరైన ఉద్దేశం, ప్రేమవుంది. వాక్యానుసారమైన జీవితం ఉంది. దానిని బట్టే తిమోతి పౌలును వెంబడించాడు (2తిమో 3:10,11) మరో ముఖ్యమైన విషయమేమంటే పౌలు, వాక్యాన్ని ఎంత ఖండితంగా చెప్పినా విశ్వాసుల పట్ల తండ్రి ప్రేమను చూపించాడు. ఈ దినాలలో సంఘాలలో బోధకులు పుట్టగొడుగుల్లా మొలుస్తున్నారు గాని ఆత్మీయ తండ్రులు కరువైపోయారు. ఆత్మల రక్షణను గూర్చిగాని విశ్వాసుల ఆత్మీయ క్షేమమును గూర్చిగాని భారంలేదు గాని ప్రతి ఒక్కరు బోధకులు కావాలన్న ఆశనే కలిగివున్నారు.

అందుకే పౌలు కొరింథీయులకు వ్రాసిన పత్రికలో ఈ మాటలు పేర్కొన్నాడు. ...క్రీస్తునందు మీకు ఉపదేశకులు పదివేలమందియున్నను తండ్రులు అనేకులు లేరు. క్రీస్తు యేసునందు సువార్త ద్వారా నేను మిమ్మును కంటిని గనుక మీరు నన్ను పోలి నడుచుకొనువారై యుండవలెనని మిమ్మును బతిమాలుకొనుచున్నాను (1 కొరింథీ 4:15, 16). పౌలు స్థానిక సంఘాలన్నిటితో ఈలాంటి సంబంధాన్ని కలిగివుండడం ప్రశంసనీయం.

**ఇ. దేవుని సంఘము మరియు దేవుని సేవకుడు**

పౌలు దేవుని సంఘాన్ని కాచే సేవకుడు ఎలా వుండాలో హెచ్చరిస్తూ, ఎందుకు అలా ఉండాలో కారణాలను కూడ వివరించాడు. తిమోతికి మరియు తీతుకు పౌలు ఇచ్చిన ఈ హెచ్చరికలన్నీ నేటి సేవకులందరికీ వర్తిస్తాయి. అందరూ వీటిని తప్పనిసరిగా పాటిస్తే సంఘాలు ఆత్మీయంగా వర్ధిల్లుతాయి.

**సేవకుని లక్షణాలు :** 1) సంఘ సిద్ధాంతాన్ని పవిత్రముగా ఎంచాలి, కాపాడాలి (1తిమో 1:3; 4:1-3; 2తిమో 2:17, 18; తీతు 2:15). 2) కల్పనాకథలకు, అపవిత్రమైన వట్టి మాటలకు దూరంగా ఉండాలి (1 తిమో 1:4; 4:7; 6:20; తీతు 1:14; 3:9). 3) మంచి మనస్సాక్షి కలిగివుండాలి (1తిమో 1:19; 2 తిమో 1:5) లేనట్లైతే విశ్వాస విషయమై ఓడ బద్దలైపోయినట్లు అవుతారు. 4) అందరి కొరకు ప్రార్థించాలి (1 తిమో 2:1). 5) వ్యక్తిగత క్రమశిక్షణ కలిగివుండేలా (1 తిమో 4:7, 8, 15) సాధనం చెయ్యాలి. 6) స్వయం పరిశీలన చేసుకోవాలి (1 తిమో 4:16). 7) విశ్వాసులకు మాదిరిగా ఉండాలి (1 తిమో 4:12; తీతు 2:7). 8) దేవుని వాక్యాన్ని చదవాలి ధ్యానించాలి. అందలి సిద్ధాంతాన్ని ఆకళింపు చేసుకోవాలి. (1 తిమో 4:13; తీతు

2:8). 9) ఆత్మీయ వరాలను అభివృద్ధి చేసుకోవాలి (1 తిమో 4:14; 2 తిమో 1:6). సంఘ కాపరి అభివృద్ధి సంఘ అభివృద్ధికి దోహదపడుతుంది. కృపావరాలను నిర్లక్ష్యం చేస్తే లేక దుర్వినియోగం చేస్తే వాటిని పోగొట్టుకొంటారు. 10) పలువర్గాల వ్యక్తులతో సరైన సంబంధం కలిగి వుండేందుకు తగిన జ్ఞానం, సాత్వికం ఉండాలి (1 తిమో 5:1,2; తీతు 2:1-6, 10). 11)తొందరపడి తీర్మానాలు గాని (1 తిమో 5:19), హస్తనిక్షేపణగాని చెయ్యవద్దు (1 తిమో 5:22). 12) పాపాన్ని ఖండించాలి (1 తిమో 5:20; తీతు 3:10,11). 13) విరోధబుద్ధితో, పక్షపాతంతో ఏ పని చెయ్యవద్దు (1 తిమో 5:21). 14) పరుల పాపంలో పాలివారైయుండవద్దు, వారిని ప్రోత్సహించవద్దు (1 తిమో 5:22). 15) వ్యక్తిగత పరిశుద్ధతను కాపాడుకోవాలి (1 తిమో 5:22). 16) వ్యక్తిగత ఆరోగ్యం విషయం శ్రద్ధ వహించాలి (1 తిమో 5:23). 17) కలిగిఉన్నవాటితో సంతృప్తిగా ఉండాలి (1 తిమో 6:6,7). 18) ధనాపేక్షకు చోటియ్యవద్దు (1తిమో 6:9,10). 19) భక్తిని, విశ్వాసమును, ప్రేమను, ఓర్పును, సాత్వికమును సంపాదించుకోడానికి ప్రయాసపడాలి (1 తిమో 6:11).

**సేవకుని పని:** సేవకుడు ఎలా పని చెయ్యాలో పలు సాదృశ్యాలతో 2తిమోతి 2వ అధ్యాయంలో చక్కగా వివరించబడినది.

1. **గృహనిర్వాహకునిగా (2 తిమో2:2) :** గృహనిర్వాహకుడు తన యజమాని ఆస్తిని కాపాడుతాడు. అందుకు అతడు నమ్మకస్థుడైయుండాలి. అతడు నమ్మకంగా ఉండడమే కాకుండ, దేవుని పనిని నమ్మకమైన వారికి అప్పగించాలి.
2. **సైనికునిగా (2 తిమో 2:3) :** సైనికుడు శ్రమ అనుభవించడానికి సిద్ధంగా ఉండాలి. ఈ జీవన వ్యాపారాలలో చిక్కుకొనకుండ, తన యజమానినే సంతోషపెట్టాలి.
3. **జెట్టిగా (2 తిమో 2:5) :** బహుమానము పొందే విధంగా ప్రయాసపడాలి (1 కొరింథీ. 9:24,25) మరియు నియమము ప్రకారం పోరాడాలి.
4. **వ్యవసాయకునిగా (2 తిమో 2:6) :** వ్యవసాయకుడు మొదట విత్తనం వెయ్యాలి. అది మొలకెత్తాక నీరు కట్టాలి, ప్రయాసపడాలి. అప్పుడే పంటలో పాలుపుచ్చుకొంటాడు (కీర్త 126:6).
5. **ఉపదేశకునిగా (2 తిమో 2:11-14) :** క్రీస్తుతో చనిపోవాలని క్రీస్తుతో జీవించాలని, క్రీస్తు కొరకు శ్రమపడాలని అప్పుడే ఆయనతో కలసి ఏలుతామని ఉపదేశించాలి.
6. **ఒక విద్యార్థిగా (2 తిమో 2:15) :** దేవుని వాక్యాన్ని శ్రద్ధగా పఠించాలి. దేవుని ఎదుట యోగ్యమైన పనివానిగా ఎంచబడాలంటే మరియు ఇతరుల యెదుట సిగ్గుపడనక్కరలేని సేవకునిగా ఉండాలంటే వాక్యాన్ని బాగా చదవాలి, ధ్యానించాలి. మనుష్యుల మాటలను లక్ష్యపెట్టవద్దు. (2 తిమో 2:16).
7. **పాత్రగా (2 తిమో 2:20, 21) :** సేవకుడు యజమానుడు వాడుకొనుటకు అర్హమైన పాత్రగా, ప్రతి సత్కార్యమునకు సిద్ధపర్చబడి, ఘనత నిమిత్తమైన పాత్రగా ఉండాలంటే ప్రత్యేకపరచుకొన్న జీవితం, పరిశుద్ధతను కాపాడుకొనే జీవితం ఉండాలి.
8. **దాసునిగా (2 తిమో 2:24) :** ప్రభువు యొక్క దాసుడు జగడమాడనివానిగాను, సాధువుగాను ఉండాలి. సాత్వికముతో శిక్షించాలి, కీడును సహించాలి.

## ఈ. దేవుని సంఘము మరియు సంఘపరిపాలకులు

ప్రతి దేశానికి ప్రభుత్వం అవసరం. ప్రభుత్వంలో పరిపాలకులు అవసరం. నాయకత్వం లేని దేశం, సంస్థలు అనాథలలాంటివి. సంఘం క్రీస్తు శరీరం. ప్రతి సంఘ సభ్యుడు ఆ శరీరంలో ఒక అవయవం. క్రీస్తే వారికి శిరస్సుగా ఉన్నా, ప్రతి అవయవం సక్రమంగా పని చెయ్యాలంటే వారికి సరైన నాయకత్వం అవసరం. అట్టి సంఘ నాయకులకు ఉండాల్సిన లక్షణాలు మరియు వారి విధులను గూర్చి పౌలు ఈ మూడు పత్రికలలో వ్రాసాడు.

**1. సంఘంలో వివిధ నాయకులు, వారి విధులు :**

**అ. అధ్యక్షులు (బిషప్పులు) (1 తిమో 3:1-7; తీతు 1:5-9) :** బిషప్ అన్న మాటకు ఉపయోగించబడిన ఎపిస్కోపస్ అనే గ్రీకు పదానికి పై విచారణకర్త అని అర్థం. వీరినే పెద్దలు అని కూడ చెప్పబడింది. అలాగే పెద్దలు అనే మాటకు ప్రెస్బుటరాస్ అనే పదం కూడా ఉపయోగించబడింది. బిషప్ మరియు సంఘ పెద్ద అనే మాటలు క్రొత్త నిబంధనలో తరచుగా పరస్పరం మార్చి ఉపయోగించబడ్డాయి. (అపొ.కా. 20:17-20; తీతు 1:5-7). బిషప్ అనే మాట ఆ వ్యక్తి కార్యనిర్వాహణను, పెద్ద అనే మాట అతని ఆత్మీయ పరిపక్వతను సూచిస్తున్నాయి.

1. అధ్యక్షులు దేవుని గృహనిర్వాహకుల వలె దేవుని సంఘాన్ని ఏలగలిగిన సామర్థ్యం కలిగి ఉండాలి (1తిమో 3:5; తీతు 1:7). పౌలు జీవించిన కాలంలో సంఘపెద్దలే లేక అధ్యక్షులే (బిషప్‌లు) సంఘ కాపరులుగా పరిగణించబడ్డారు (1 పేతు 5:1-4). వారికి అప్పగించబడిన దానిపై ప్రభువులైనట్టుండక, మందకు మాదిరులుగా ఉండాలని హెచ్చరించబడ్డారు. అయితే ఈ రోజుల్లో సంఘానికి కాపరి ప్రధాన నాయకునిగా, సంఘ పెద్దలు కార్యనిర్వాహకులుగా ఉన్నారు. కాపరి ఆత్మీయ విషయాలపై శ్రద్ధవహిస్తాడు, సంఘపెద్దలు పరిపాలన నిర్వహణ జరిగిస్తారు. అయితే వారి పరిపాలన కాపరి చేసే పరిచర్యకు, అనగా సువార్త సేవ ద్వారా ఆత్మలరక్షణ, రక్షించబడిన వారి ఆత్మీయ క్షేమము మరియు సంఘ విస్తరణకు సంబంధించినదిగా ఉండాలి. కాపరిని ప్రోత్సహించి, సహకరించేదిగా వుండాలి; గాని వారు పరిచర్య అభివృద్ధికి అడ్డుబండలుగా ఉండకూడదు. సేవ విషయం తీర్మానాలు చేసుకోడానికి, అందుకు తగిన ద్రవ్యాన్ని ఖర్చు చెయ్యడానికి తగిన స్వేచ్ఛ కాపరికి ఉన్నప్పుడే సంఘం వర్థిల్లుతుంది. కాపరి, వారి ఆత్మలను కాయాలి; వారి విషయం దేవునికి లెక్క అప్పగించాలి; గనుక వారు దుఃఖంతో కాక సంతోషంగా పని చేసేందుకు సంఘ పెద్దలు అతనికి లోబడాలి సేవలో సహకరించాలి (హెబ్రీ 13:17).

2. సంఘపెద్దలు దేవుని వాక్యాన్ని బోధించుటకు తగినవారైయుండాలి (1 తిమో 3:3). సంఘకాపరి ఆత్మీయంగా సంఘాన్ని పోషించే బాధ్యత వహించినా సంఘ పెద్దలు కూడ దేవుని వాక్యం బాగా తెలిసినవారై యుండాలి. అందుక కారణాలను పౌలు తీతు 1:9లో వ్రాసాడు. అంతమాత్రమే కాక అవిశ్వాసులను, క్రీస్తును అంగీకరించేలా ఒప్పింపజేయడం మరియు విశ్వాసులను ఎదగడానికి, సంఘ క్షేమాభివృద్ధి కొరకు కలసి పనిచెయ్యడానికి ప్రోత్సహించడం అవసరం.

**ఆ. పరిచారకులు మరియు పరిచారకురాండ్రు (1తిమో 3:8-12; రోమా 12:7; 16:1; ఫిలి 1:1). :** వీరి విధులేవో క్రొత్త నిబంధనలో ఎక్కడేగాని ఖచ్చితంగా వ్రాయబడలేదు.

బహుశ కార్యనిర్వాహణలో కొన్ని సమస్యలను నివారించడానికి పరిచారకులను నియమించి ఉండవచ్చును (అపొ.కా. 6:1-8). ఇతర బాధ్యతలను అనగా పంచిపెట్టుట (అపొ.కా. 6:2; రోమా 12:8) మరియు ఇతర పరిచర్యను (మందిరంలోని సామాగ్రిని భద్రపరచుట, తగిన రీతిగా అమర్చుట మొదలైన వాటిని) పరిచారకులు నిర్వర్తిస్తారు (రోమా 12:7). వీరు కూడా ఆత్మీయపరులైన విశ్వాసులైయుండాలి (అపొ.కా. 6:5; 1 తిమో 3:8-13).

**2. సంఘ పరిపాలకుల (పెద్దల) లక్షణాలు :**

**"ఎవడైనను అధ్యక్షపదవిని ఆశించిన యెడల అట్టివాడు దొడ్డపనిని అపేక్షించుచున్నాడను మాట నమ్మదగినది"** అని పౌలు 1 తిమో 3:1 లో వ్రాసాడు. అనగా సంఘంలో అధ్యక్షుల అవసరత కనిపిస్తున్నది. మరియు అధ్యక్షత వహించడం గొప్పపని అని, అంతమాత్రమే కాదు దానిని ఆశించేవారు, అపేక్షించేవారు కూడ ఉంటారని అర్థమౌతున్నది. ఈలాంటి శ్రేష్ఠమైన పదవిని అపేక్షించడం మంచిదే కాని మొదట అందుకు తగిన అర్హతలున్నాయో లేదోనని పరీక్షించుకోవడం అవసరం. దొడ్డపనిని అపేక్షించుట అంటే పరిశుద్ధాత్మ ద్వారా అనుగ్రహించబడిన కృపావరాన్ని ఉపయోగించుటకు అనుగుణమైన స్థానాన్ని ఎన్నుకొనుట. అట్టి సామర్థ్యాన్ని, పరిశుద్ధాత్మ నడిపింపును పొందనివారు అధ్యక్షపదవికి అనర్హులు. మరో ముఖ్యమైన విషయమేమంటే పౌలు కాలంలో సంఘంలో ఒకే అధ్యక్షుడు లేడు. అనేకులున్నారని ఈ వాక్యాన్ని బట్టి గ్రహించవచ్చును. ఈ అధ్యక్షులకు ఉండవలసిన లక్షణాలు మరియు ఉండకూడని లక్షణాలను గూర్చి పౌలు ఈ మూడు పత్రికలలో స్పష్టంగా వ్రాసాడు. అవన్నీ నేటి సంఘ పెద్దలు కూడ కలిగి ఉండాలి.

**అ. సంఘ పెద్దలకు ఉండాల్సిన లక్షణాలు :**

1. **నిందారహితుడైయుండాలి (1తిమో 3:2) :** అతడు చేసే పని విషయంలో నిందారహితునిగా ఉండాలి. దేవుని పని చేస్తూవుండగా అనేక నిందలు వస్తాయి. అయితే అవి అతని జీవితంలో వాస్తవం కాకూడదు. అతని పని విషయంలో నిందారహితునిగా ఉండాలి. ప్రజలు మోపిన నిందలు నిజమైనవైతే అతడు పెద్దగా ఉండడానికి అర్హుడుకాదు. మరియు అతడు దుర్వ్యాపారము విషయము నేరము మోపబడని వాడైయుండాలి (తీతు 1:6).
2. **ఏకపత్నీ పురుషుడైయుండాలి (1 తిమో 3:2; తీతు 1:6) :** ఈ వాక్యాన్ని బట్టి, సంఘ పెద్దలుగా పురుషులే ఉండాలని, అతడు వివాహితుడైయుండాలని, ఒకే భార్యను కలిగి ఉండాలని గ్రహించాలి. అందుకు కారణాలు కూడ వివరించబడ్డాయి. ఏకపత్నీ పురుషుడు అంటే, బహుభార్యాత్వాన్ని మాత్రమే కాక విడాకులను కూడ పౌలు నిషేధించినట్లు అర్థం చేసుకోవాలి. ఈలాంటివారు సంఘాన్ని ఏలడానికి అర్హులు కారు. కుటుంబాన్ని సక్రమంగా ఏలినవారే, సంఘాన్ని ఏలగలుగుతారు. ఎందుకంటె సంఘం కూడ దేవుని కుటుంబం గనుక.
3. **మితానుభవుడైయుండాలి (1 తిమో 3:3) :** నింపాదిగా నెమ్మదిగా వుండాలి. అనాలోచితంగా మాట్లాడడం, పనిచెయ్యడం కాక ఆలోచించి సావధానంగా సమయస్ఫూర్తితో పనిచేసేవాడై యుండాలని అర్థం.

4. **స్వస్థబుద్ధిగలవాడైయుండాలి (1 తిమో 3:3; తీతు 1:8) :** స్వస్థబుద్ధి అంటే స్థిరబుద్ధి అని అర్థం. సంఘ అధ్యక్షుడు చపలచిత్తుడు కాక, తన పనిని గూర్చి స్థిరమనస్సు గలవాడై యుండాలి. అలా అని ఎప్పుడూ ముఖావంగా గంభీరంగా ఉండాలని కాదుగాని తనకు అప్పగించబడిన పనినే లక్ష్యంగా కలిగి ఉండాలి.

5. **మర్యాదస్థుడైయుండాలి (1 తిమో 3:3) :** అనగా మంచి ప్రవర్తన, ఇతరులు అతన్ని ప్రశ్నించని విధంగా, క్రమశిక్షణతో కూడిన జీవితం కలిగియుండాలి. మరో విధంగా చెప్పాలంటే, నిర్లక్ష్యంగా ఉండకూడదు. వారి నిర్లక్ష్య ప్రవర్తనను బట్టి తాము చేయని తప్పులను గూర్చి కూడ ఇతరులచే ప్రశ్నించబడతారు. కొన్ని పనులు మంచి ఉద్దేశంతో చేసినా దాని వలన వ్యక్తిగత సాక్ష్యం పాడుకాకుండ, నిందించబడడానికి అవకాశమివ్వకుండ జాగ్రత్తపడాలి.

6. **అతిథి ప్రియుడు మరియు సజ్జన ప్రియుడై ఉండాలి (1 తిమో 3:3; తీతు 1:8) :**

ఎ. అతిథులను, పరదేశులను ప్రేమించి, అతిథ్యమిచ్చే గుణం ఉండాలి. తన కుటుంబస్థులను ఈ విషయంలో ప్రోత్సహించడమే కాకుండ వ్యక్తిగతంగా తాను కూడ అలాంటి ఆశ కలిగియుండాలి. ఇది విశ్వాసులందరిలో ఉండాల్సిన ప్రాముఖ్యమైన లక్షణం (1 తిమో 5:10; హెబ్రీ 6:10, 13:1).

బి. సజ్జనులను, అనగా మంచివారిని ప్రేమించి, వారితో సహవాసం చేయాలి (తీతు 1:8). మంచి జీవితం మరియు సాక్ష్యం గలవారితో స్నేహం చెయ్యడం వలన అనేక విషయాలను నేర్చుకోవచ్చును. సంఘ పెద్దలు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించడానికి వారు కూడ ప్రోత్సహిస్తారు. ఒకవేళ ఏమైన పొరపాట్లుంటే సరిచేస్తారు.

7. **బోధింపతగిన వాడైయుండాలి (1 తిమో 3:3; తీతు 1:9) :** నేటి సంఘాలలో ఇది బొత్తిగా లోపించింది. వాక్యం తెలియనివారు, ప్రార్థన చెయ్యడం కూడ రానివారు, చివరికి రక్షణలేని వారు సయితం సంఘంలో పెద్దలుగా చెలామణి అవుతున్నారు. పెత్తనాలపై ఉన్న కాంక్ష దేవుని వాక్యం, ప్రార్థన విషయం లేదు. దేవుని వాక్యాన్ని బోధించలేని వారు సంఘ పెద్దలుగా ఉండడానికి అర్హులుకారని పౌలు ఖచ్చితంగా వ్రాసాడు.

8. **సాత్వికులైయుండాలి (1 తిమో 3:3) :** సాత్వికం అన్నది బలహీనత కాదు. (Meekness is not weakness) గాని ఒక బలమైన గుఱ్ఱాన్ని కళ్ళెముతో బిగించినపుడు తన యజమాని అదుపులోనికి ఎలా వస్తుందో అలా సంఘ పెద్దలు సాధువైన గుణం కలిగియుండాలి. బలమున్నా అధికారం ఉన్నా, సామర్థ్యం ఉన్నా దానిని ఇతరులపై ప్రయోగించక పోవడమే సాత్వికం. గ్రీకు భాషలో ఈ మాటకు వాడబడిన పదానికి "నిన్ను నీవు సరిగా ఎంచుకొనుట" అని అర్థం. అనగా తన్ను తాను ఎంచుకొన తగినదానికంటె ఎక్కువగా ఎంచుకొనకూడదు (రోమా 12:3).

9. **కుటుంబం విషయం మంచి సాక్ష్యం కలిగియుండాలి (1 తిమో 3:4; తీతు 1:6) :** సంఘ పెద్దలు వ్యక్తిగత సాక్ష్యంతో పాటు కుటుంబ సాక్ష్యాన్ని కూడ కాపాడుకోవాలి. మొట్టమొదట అతడు తన యింటివారిని బాగుగా ఏలువాడై ఉండాలి. విశ్వాసులైన పిల్లలు గలవాడై తన పిల్లలను స్వాధీనపరచుకోవాలి. అనేక సంఘకాపరులు మరియు సంఘ పెద్దల పిల్లలు తమ తల్లిదండ్రులకు తలవంపులు తెచ్చేవారుగా సంఘానికి అభ్యంతరకరంగా జీవిస్తున్నారంటే కుటుంబాల పట్ల వారి నిర్లక్ష్య వైఖరే కారణం అనడానికి

ఏ సందేహము లేదు. సంఘంలో కార్యకలాపాలు చెయ్యాలన్న తాపత్రయంలో కుటుంబాన్ని విస్మరించకూడదు. ఎంతసేవ చేసినా ఎన్ని గొప్పకార్యాలు చేసినా కుటుంబాన్ని నాశనం చేసుకొంటే ఫలితం శూన్యం. ఒక దినాన ప్రభువుకు లెక్క అప్పగించాలి.

10. **సంఘమునకు వెలుపటి వారి చేత మంచి సాక్ష్యం పొందినవాడై యుండాలి (1 తిమో 3:7) :** కుటుంబములో సంఘంలోనే కాక సంఘం వెలుపల కూడ సంఘ పెద్దలు మంచి సాక్ష్యాన్ని కలిగి ఉండాలి. సంఘంలో పెద్దలుగా ఉన్నవారు ప్రభుత్వ ఉద్యోగాలలో అన్యులుగా చెలామణి అవడం, అప్పులు చేసి తీర్చకుండడం, ఇరుగు పొరుగువారితో, బంధువులతో సరైన సంబంధాలు లేకపోవడం అవమానకరమైన విషయాలు. అలాంటివారు నిందపాలై అపవాది ఉరిలో పడిపోతారు.

11. **నీతిమంతుడైయుండాలి (తీతు 1:8) :** నీతిమంతుడు లేడు, ఒక్కడైనను లేడు (రోమా 3:11) అని వాక్యం చెప్తుంది. కేవలం యేసు ప్రభువు సిలువకార్యాన్ని విశ్వాసంతో అంగీకరించి పాప క్షమాపణ పొందడం ద్వారానే మనిషి నీతిమంతునిగా తీర్చబడతాడు. అట్టి వ్యక్తే సంఘనాయకునిగా ఉండడానికి అర్హుడు. అంతమాత్రమే కాదు, నీతిమంతునిగా తీర్చబడిన అతడు, నీతిగా జీవించాలన్న ఆశ (మత్త 5:6). నీతి కొరకు హింసలు పొందేందుకు తగిన సిద్ధపాటు (మత్తయి 5:10) కలిగి ఉండాలి.

12. **పవిత్రుడై యుండాలి (తీతు 1:8) :** ఇది అన్నిటికన్నా ప్రాముఖ్యమైన విషయం. యేసు రక్తం ద్వారా శుద్ధీకరించబడిన వ్యక్తి తన పరిశుద్ధతను కాపాడుకోవలి, కొనసాగించుకోవాలి (1 థెస్స 4:3). అందుకే మనం పిలువబడ్డాం (1 కొరింథీ. 1:2). అలాంటి పరిశుద్ధతలో కొనసాగాలంటే దినదినం దేవుని వాక్యం ద్వారా శుద్ధీకరించబడే అనుభవం ఉండాలి (ఎఫె 5:27).

13. **ఆశానిగ్రహం గలవారై యుండాలి (తీతు 1:8) :** ఆశానిగ్రహం ఆత్మ ఫలంలో ఒకటి (గల 5:22). ఆశానిగ్రహం అంటే తన స్వకీయేచ్ఛలను నిగ్రహించుకొనుట. భావోద్రేకాలను అదుపులో ఉంచుకొనుట. సంఘాన్ని పరిపాలించే వారికి ఈ లక్షణం ఎంతైన అవసరం. సంఘానికి నష్టం వాటిల్లకుండ ఇంద్రియ నిగ్రహం కలిగి పని చెయ్యాలి. ఇది ఆత్మపూర్ణమైన జీవితం ద్వారానే అనగా పరిశుద్ధాత్మ స్వాధీనంలోకి వచ్చుట సాధ్యమౌతుంది (2 తిమో 1:10).

**ఆ. సంఘ పెద్దలలో ఉండకూడని లక్షణాలు :**

1. **మద్యపానియై ఉండకూడదు (1తిమో 3:3; తీతు 1:7) :** ఆత్మపూర్ణులుగా ఉండాల్సిన సంఘనాయకులు మద్యముతో మత్తులైయుంటె (ఎఫె 5:18) సంఘాన్ని స్వాధీనంలో వుంచుకోవలసిన వారు మద్యం స్వాధీనంలో ఉంటారు. మద్యమే అతన్ని ఏలుతుంది. గనుక అతడు సంఘాన్ని ఎలా ఏలుతాడు? పైగా మద్యములో దుర్వ్యాపారం ఉందని వాక్యం చెప్తున్నది. ఇక అతడు సద్వ్యాపారాన్ని (దేవుని సేవను) ఎలా చెయ్యగలడు. అలాంటి వారిని సంఘ పెద్దలుగా ఉండడానికి ప్రోత్సహించకూడదు.

2. **కొట్టువాడైయుండ కూడదు (1తిమో 3:3; తీతు 1:7) :** అనగా హింసాత్మక దృక్పథం, నేర ప్రవృత్తిలేని వాడైయుండాలి. అనేకులు తమ అసమర్థతను కప్పిపుచ్చుకోడానికి

తమ స్వార్థాన్ని నెరవేర్చుకోడానికి ఈ ఆయుధాన్నే ఉపయోగిస్తారు. ఇంట్లో భార్యాపిల్లలపై, ఇరుగు పొరుగువారిపై, పనిచేసే చోట చిన్న చిన్న విషయాలకు చెయ్యి చేసుకొంటారు. అలాంటివారు సంఘ పెద్దలుగా తగరు.

3. **జగడమాడ కూడదు (1తిమో 3:3) :** అనగా సంఘంలో సమస్యలు సృష్టించేవానిగా ఉండవద్దు. సమస్యలను నెమ్మదిగా పరిష్కరించుకోవాలి గాని ప్రతి చిన్న విషయానికి పోట్లాడి, తమ పంతమే నెగ్గాలన్న స్వభావం ఉండకూడదు.

4. **ధనాపేక్ష ఉండకూడదు (1తిమో 3:3) :** ధనాన్నే ప్రధానమైనదిగా ఎంచడం విగ్రహారాధనతో సమానం. సంఘపాలనకు, సువార్త సేవకు డబ్బు అవసరమే, అయితే దానిని అపహరించాలన్న ఆశ, లేక దాని వలన కలిగే దుర్లాభమును గూర్చిన అపేక్ష (తీతు 1:7) సంఘ పెద్దలలో ఉండకూడదు. అంత మాత్రమే కాదు దానిని దుర్వినియోగం చెయ్యడం కూడ తప్పే. దేవుని సొమ్ముతో ఎంతో జాగ్రత్తగా వ్యవహరించాలి. ఆర్థిక వ్యవస్థ సంఘ సేవకు ఆయువుపట్టులాంటిది గనుక అలాంటి దురుద్దేశం గలవారిని ఆర్థిక వ్యవహారాలకు దూరంగా ఉంచడం మంచిది.

5. **అతడు క్రొత్తగా చేరినవాడైయుండ కూడదు (1 తిమో 3:6) :** కొన్ని సంఘాలలో క్రొత్తగా రక్షణ పొందినవారిని, లేక సంఘానికి క్రొత్తగా పరిచయమైనవారిని సంఘ పెద్దలుగా చెయ్యడం శోచనీయం. వారికి భౌతికపరమైన అర్హతలుండవచ్చునుగాని ఆత్మీయ అనుభవయం లేకుంటె సంఘాన్ని ఏలకపోగా, తన అర్హతలను బట్టి లేక తనకు ఇవ్వబడిన స్థానాన్ని బట్టి గర్వించి సాతానుకు కలిగిన శిక్షకు (యెషయా 14:12-15) పాత్రుడయ్యే ప్రమాదం ఉంది.

6. **స్వేచ్ఛాపరుడైయుండకూడదు (తీతు 1:7) :** స్వేచ్ఛాపరుడు ఎప్పుడూ తన స్వంత చిత్తాన్నే నెరవేర్చుకొంటాడు. సంఘ పెద్దలు దేవుని గృహనిర్వాహకులు మరియు దేవుని ప్రతినిధులు గనుక సంఘం విషయంలో దేవుని చిత్తాన్నే నెరవేర్చాలి.

7. **ముక్కోపియై ఉండకూడదు (తీతు 1:7) :** కొంతమందికి ముక్కు మీదే కోపం ఉ ందంటారు. అనగా కోపాన్ని అదుపులో ఉంచుకోలేరు. ప్రతి చిన్నదానికి కోపపడటం, లేక ఉద్రిక్తులగుట వారి ఆరోగ్యానికే కాదు సంఘ ఆరోగ్యానికి కూడ నష్టం కలిగిస్తుంది. కోపం రావడానికి అనేక కారణాలున్నా దానిని అదుపులో ఉంచుకోవాలి. కోపం మనల్ని స్వాధీనంలో ఉంచుకొంటె పాపం చేసే అవకాశంవుంది. (ఎఫె 4:26) కనుక జాగ్రత్త.

### ఉ. దేవుని సంఘము - వివిధ వర్గాల ప్రజలు :

1. **యౌవనస్థులు :** సంఘంలో వివిధ వర్గాల ప్రజలను గూర్చిన పలు విషయాలు పౌలు ప్రస్తావించినపుడు అందులో యౌవనస్థులను కూడ చేర్చాడు. ముఖ్యంగా బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్న తిమోతి మరియు తీతు కూడ యౌవనస్థులే గనుక వారు మరియు సంఘంలోని ఇతర యౌవనస్థులు తీసుకోవలసిన జాగ్రత్తలను గూర్చి పౌలు ఈ మూడు పత్రికలలో సూచిస్తు వచ్చాడు. యౌవన దశ చాలా ప్రాముఖ్యమైనది. వారి భవిష్యత్తు నాణ్యమైనదిగా ఉండాలంటే ఈ వయస్సులో నాణ్యమైన జీవిత ప్రమాణాలను, విలువలను సంతరించుకోవాలి. జీవితంలో సాఫల్యత సాధించాలంటే క్రమశిక్షణ, తగిన ప్రయాసం, సాధన అవసరం. అలాగే ఆత్మీయ జీవితంలోను అవసరం. పౌలు వ్రాసిన ఈ సలహాలు

నేటి యువతీయువకులకు ఎంతో ఉపయోగకరమైనవి.

ఎ. **దైవ భక్తి సాధన (1తిమో 4:8, 15) :** సాధనమున పనులు సమకూడు ధరలోన అని వేమన కవి చెప్పిన మాట అందరికీ తెలిసిందే. దైవభక్తి విషయంలో సాధనము చేసుకోవాలని పౌలు హెచ్చరిండానికిగల ఒక కారణం ఏమంటే, యౌవనస్తులు సాధారణంగా శరీర సంబంధమైన సాధనకు ప్రాధాన్యతనిస్తారు. తమ అందాన్ని కాపాడుకోవడానికి బ్యూటీపార్లర్‌లవైపు, శరీర సౌష్టవాన్ని పెంచుకోవడానికి లేక తగ్గించుకోడానికి జిమ్‌లవైపు నేటి యువత పరుగులు తీస్తున్నది. అందంగా కనబడాలన్న ఆశ తప్పుకాదు గాని దానికే ప్రాధాన్యతనిచ్చి ఆత్మీయ విషయాల్ని విస్మరించడం పాపం. ఈ శరీరం తాత్కాలికమైనది, క్షయమైనది, గనుక అది కొంతమట్టుకే ప్రయోజనకరంగాని, దైవభక్తి ఇప్పటి జీవము విషయంలోను, రాబోవు జీవము విషయంలోను ప్రయోజనకరమైంది.

బి. **గురి కలిగిన జీవితం (2 తిమో 4:7) :** దేవుడు యౌవనస్తులకు ఎంతో ప్రాధాన్యతనిచ్చాడు. మొదటి మానవుడైన ఆదామును ఓ యౌవనస్తునిగా సృజించి, లోకాన్నంతా అతని ఆధిపత్యంలో ఉంచాలనుకొన్నాడు గాని సాతాను ఆదామును తన ఆధిపత్యంలోనికి మళ్ళించాడు. నేటికీ యువశక్తిని పెడత్రోవపట్టించే సాతాను శక్తుల్ని సంఘాల్లో సమాజంలో చూస్తున్నాము. దేవుడు యౌవనస్తులకిచ్చిన ఆధిక్యతల్ని పొందాలంటే వారి జీవితం పట్ల దేవుని ఉద్దేశాన్ని తెలుసుకోవాలి. ఆ ఉద్దేశాన్నే లక్ష్యంగా చేసుకోవాలి. ఆ లక్ష్యాన్ని సాధించడానికి ప్రయాసపడాలి. పౌలు "మంచి పోరాటము పోరాడితివి, నా పరుగు కడముట్టించితిని" అని చెప్పగలిగాడు.

సి. **యౌవనేచ్ఛలనుండి పారిపోవుట (2 తిమో 2:22) :** ఈ వచనాన్ని యువతీ యువకులందరు కంఠస్తం చేసి తమ హృదయాలలో భద్రం చేసుకోవాలి. యౌవనేచ్ఛల నుండి పారిపోవుట అంటే రెండు అర్థాలున్నాయి. పాపమునకు పురికొల్పే పరిసరాలు, దృశ్యాలు మరియు వ్యక్తుల నుండి దూరంగా ఉండాలి. అవసరమైతే అక్కడి నుండి పారిపోవాలి (ఆది.కా. 39:11,12). శరీరాశ, నేత్రాశలను, చెడుతలంపులను జయించాలి. పాపంలో పడకుండ వాటిని అదుపులో ఉంచుకోవాలి.

డి. **పవిత్రంగా జీవించాలి :** దేవుడు పరిశుద్ధుడు గనుక ప్రతి యౌవనస్తుడు, యౌవనస్థురాలు పరిశుద్ధంగా ఉండాలని దేవుని కోరిక. పౌలు కోరిక కూడ. అందుకు - అపవిత్రమైన మాటలకు విముఖులై యుండాలి (1తిమో 6:20, 2తిమో 2:16). అశ్లీల సాహిత్యం పాపానికి ప్రేరేపిస్తుంది గనుక వాటిని విసర్జించాలి. పవిత్రంగా జీవించడానికి, పాపాన్ని జయించడానికి శక్తినిచ్చే వాక్యాన్ని చదవాలి ధ్యానించాలి (కీర్త 119:9,11). ఈ లేఖనాలే రక్షణార్థమైన జ్ఞానాన్ని కలుగజేస్తాయి (2తిమో 3:15). పవిత్రహృదయులైన వారితో సహవాసం చెయ్యాలి (2తిమో 2:22, 1తిమో 6:11). దుష్ట సాంగత్యం మంచి నడవడిని సయితం చెరుపుతుంది జాగ్రత్త (1 కొరింథీ. 15:33).

5. **అన్ని విషయాలలో మితంగా ఉండాలి (2 తిమో 4:5) :** తిండి, నిద్ర, తిరగడం వంటి వాటిలోను సమయాన్ని సద్వినియోగం చేసుకొనుటలోను అన్నిటికంటె ముఖ్యంగా తన భావోద్రేకాలను అదుపులో ఉంచుకోవడానికి, జీవితాన్ని క్రమపర్చుకోడానికి ఈ లక్షణం ఎంతైనా అవసరం.

6. **కల్పనాకథలవైపు తిరుగవద్దు :** పౌలు కాలంనాటికి, ప్రస్తుతకాలానికి కల్పనా కథలు అత్యున్నత స్థాయికి పెరిగిపోవడమే కాకుండ వాటిచేత ఆకర్షించబడిన యువత సోమరితనానికి అలవాటుపడి బాధ్యతారహితంగా ప్రవర్తిస్తుంది. తమ జీవితమనే వృక్షాన్ని సోమరితనమన్న రంపంతో కోసివేసుకొంటున్నారు. ఆధునిక సాంకేతిక దృశ్య, శ్రవణ సాధనాలు (రేడియో, టి.వి. కంప్యూటర్) తమ పురోగతికి ఉపయోగించడానికి బదులు, కల్పనా కథల కొరకు ఉపయోగిస్తు అసంకల్పితమైన వాటిని వాస్తవాలనుకొని జీవితాల్ని నాశనం చేసుకొంటున్నారు. కల్పనా కథలన్నీ ఓ మిథ్యనే. క్రీస్తులోనే నీ జీవితం వాస్తవికం అవుతుంది.

7. **తన యౌవనమును బట్టి ఎవరూ తృణీకరించకుండ చూచుకోవాలి.** ప్రవర్తనను బట్టి నైతిక జీవితాన్ని బట్టి, స్నేహితులను బట్టి వ్యక్తిత్వాన్ని బట్టి లేక నీ గుణలక్షణాలను బట్టి ఎవరూ నిన్ను తృణీకరించకుండ చూచుకోవాలి.

8. **ఆత్మీయపరులైన నాయకులను గురిగా పెట్టుకోవాలి.** యౌవనస్తులలో ఉన్న మరో గొప్ప శోధన వ్యక్తిపూజ. ఎవరో ఒక వ్యక్తిని తమ జీవిత నాయకునిగా గురిగా ఉంచుకొని వారిలాగే ఉండడానికి ప్రయత్నిస్తారు. ముఖ్యంగా ఫాషన్స్ విషయంలో సినీ నటీనటులనే గురిగా ఉంచుకొంటారు. క్రీస్తే మన జీవితానికి అందరిని మించిన నాయకుడు. ఆయనను పోలి జీవించడానికి ఆయనొక్కడే తగినవాడు. అందుకే పౌలు నేను క్రీస్తును పోలి నడుచుకొనుచున్న ప్రకారము మీరును నున్న పోలి నడుచుకొనుడి అని వ్రాసాడు (1 కొరింథీ. 11:1), అనగా పౌలు కూడా ఒక మంచి మాదిరికరమైన నాయకుడు. కనుకనే తిమోతి అతన్ని అనుసరించాడు (2 తిమో 3:10,11). నీవు ఎవర్ని అనుసరిస్తున్నావు. ఒక మంచి ఆత్మీయనాయకున్ని గురిగా ఉంచుకొని అతని వలె ఎదగడానికి ప్రయత్నించు.

9. **విశ్వాసులకు మాదిరిగా జీవించాలి (1 తిమో 4:12) :** నీవు ఆత్మీయ నాయకులను మాదిరిగా తీసుకోవడమే కాకుండ నీవే ఇతరులకు మాదిరిగా ఉండాలి. ఆ విధంగా నీ జీవితాన్ని మలచుకోవాలి. మాటలో ప్రవర్తనలో ప్రేమలో, విశ్వాసంలో పవిత్రతలో విశ్వాసులకు మాదిరిగా ఉండాలి.

ఇక వివాహితులైన యౌవనస్తుల విషయానికొస్తే యౌవనస్త్రీలు తమ భర్తలకు లోబడి తమ భర్తలను శిశువులను ప్రేమించువారును, స్వస్థబుద్ధిగలవారును పవిత్రులును, ఇంటనుండి పనిచేసికొనువారును, మంచివారునై యుండాలి (తీతు 2:5). అలాగే యౌవన పురుషులు స్వస్థబుద్ధిగలవారై యుండాలి (తీతు 2:6).

2. **వృద్ధులు :** వృద్ధులను గద్దించక తల్లిదండ్రులుగా భావించి హెచ్చరించాలి (1 తిమో 5:1,2). వృద్ధులైన పురుషులు మితానుభవంగలవారు, మాన్యులు, స్వస్థబుద్ధిగలవారు, విశ్వాస ప్రేమసహనముల యందు లోపములేనివారునై యుండాలి. ఆలాగే వృద్ధ స్త్రీలు కొండెకత్తెలు, మిగుల మద్యపానాసక్తులునై యుండక, భయభక్తులుగలవారై యౌవన స్త్రీలకు ఉపదేశం చేసేవారుగా ఉండాలి (తీతు 2:2-5).

3. **విధవరాండ్రు :** విధవరాండ్ర పోషణను గూర్చిన బాధ్యత ఆదిమ సంఘం చేపట్టినా (అపొ.కా. 6:1-8) ఈ విషయంలో ఆచరణాత్మకంగా ఎదురయ్యే సమస్యల్ని నిరోధించడానికిగాను పౌలు నిజమైన విధవరాండ్రు ఎవరో పరిశీలించి తెలిసికోవాలని వ్రాసాడు (1 తిమో

5:9,10). మనం ప్రేమలో వర్ధిల్లాలిగాని మన ప్రేమ తెలివితో కూడినదైయుండాలి (ఫిలిప్పీ 1:11). సంఘం సత్క్రియలు చేయాలిగాని అవి నిష్ఫలం కాకుండునట్లు అవసరతను బట్టి, సమయోచితంగా చేయాలి (తీతు 3:14).

4. **దాసులు :** దాసులు తమ యజమానులు పూర్ణమైన ఘనతకు పాత్రులని ఎంచాలి. యజమాని విశ్వాసియైనా, అవిశ్వాసియైనా దాసులుగానే ఉండాలి, విశ్వాసులైన యజమానులకు మరి ఎక్కువ సేవచేయాలి (1తిమో 6:1,2), లేనట్లైతే దేవుని నామము, ఆయన బోధ దూషింపబడడానికి వారు కొరకులౌతారు (తీతు 2:10).

5. **ధనవంతులు (1 తిమో 6:17-19) :** ఇహమందు ధనవంతులైన వారు అస్థిరమైన ధనమునందు కాక దానిని దయచేసిన దేవునిపైననే తమ నమ్మకాన్ని ఉంచాలి. వారికున్న ధనాన్ని బట్టి గర్వించవద్దు. అంతమాత్రమే కాదు వారు వాస్తవమైన జీవాన్ని సంపాదించుకోడానికి, రాబోవు కాలమునకు మంచి పునాది తమ కొరకు వేసుకొంటు తమ ధనంలో ఇతరులకు భాగమునివ్వాలి. కేవలం ఈ లోక ధనాన్నేకాక సత్క్రియలు అనే ధనాన్ని కలిగి ఉండాలి.

### ఊ. దేవుని సంఘము - ఆత్మీయ భ్రష్టత (2 తిమో 3:1-7).

పౌలు మంచి బోధకుడు ఉపదేశకుడు మాత్రమే కాదు గాని ఈ బాగంలో ఒక ప్రవక్తగా కూడ కనిపిస్తున్నాడు. అంత్యదినాలలో సంఘములో సంభవించబోయే ఆత్మీయ భ్రష్టతను గూర్చి పౌలు ముందుగానే హెచ్చరిస్తున్నాడు. ఆత్మీయ భ్రష్టత అంటే ఏంటి? "విశ్వాస సంబంధమైన సూత్రాల నుండి పూర్తిగా వైదొలగడమే ఆత్మీయ భ్రష్టత" అని వెబ్‌స్టర్ అనే భక్తుడు పేర్కొన్నాడు. సువార్త సత్యం, మరియు వారి విశ్వాసానికి పునాదిగానున్న సిద్ధాంతాలన్నీ తెలిసినా, వాటిని తృణీకరించడమే భ్రష్టత్వం. అంత్యదినాలలో రక్షించబడిన వారి విశ్వాసాన్ని తొలగించే ఆత్మీయ భ్రష్టత కలుగబోతుంది. అందుకే లూకా 18:8లో యేసు ప్రభువు ఒక ప్రశ్న వేస్తున్నారు. "మనుష్య కుమారుడు వచ్చునప్పుడు, ఆయన భూమి మీద విశ్వాసము కనుగొనునా?" ఈ భ్రష్టత్వాన్ని గూర్చిన భయమును బట్టి పౌలు ఈ పత్రికలలో దేవుని వాక్యం యొక్క ప్రాధాన్యతను గూర్చి పదే పదే నొక్కి వక్కాణిస్తున్నాడు.

ప్రియ పాఠకులారా! ఆనాడు పౌలు చెప్పిన అంత్యదినాలు, ప్రస్తుతం మనమున్నకాలమే. తప్పుడు సిద్ధాంతాలు, ఆత్మీయ భ్రష్టత్వం సంఘం యొక్క విశ్వాసాన్ని పటాపంచలు చేసే చెడ్డదినాలివి. ఈ తప్పు సిద్ధాంతాలను ఎదిరించి, విశ్వాసాన్ని కాపాడుకోవాలంటే దేవుని వాక్యాన్ని, అందలి సత్యాలను ఎరిగి ఉండాలి. దేవుని వాక్యం ఉపదేశించడానికి, ఖండించడానికి, తప్పుదిద్దడానికి, నీతియందు శిక్షచేయడానికి ప్రయోజనకరమైయున్నది (2 తిమో 3:16, 17). మీ ఆత్మీయ జీవితం ఎలా ఉందో పరిశీలించుకోండి. పౌలు చెప్పిన సలహాలను పాటించి, అతని హెచ్చరికలతో జీవితాన్ని సరిదిద్దుకొని పౌలు చెప్పిన తుదిపలుకులతో మనం కూడ ఏకీభవించి, గొప్ప నిశ్చయతతో, నిరీక్షణతో ఆ మాటల్ని చెప్పగలగాలి. **"మంచి పోరాటము పోరాడితిని, నా పరుగు కడ ముట్టించితిని, విశ్వాసము కాపాడుకొంటిని" (2 తిమో 4:7).**

**TTB - Telugu - Study Outlines - Books of I & II THESSALONIANS and I & II TIMOTHY**

Printed by : Premadhara, Trans World Radio - India, 12-1-334/17/3, Lalapet, Secunderabad - 500 017. Ph : 040-27003011

**FREE** MP3 DOWN LOAD - Log on to :
**www.radio882.com**